MAHILA SADHIKARATHA

# మహిళా సాధికారత

స్వయంసహాయ ఉద్యమ సమాచార తెలుగు మాస పత్రిక

mas

సంపుటి: 21 సంచిక: 2 రంగారెడ్డి అక్టోబర్ 2022 పేజీలు : 36 వెల : రూ. 10/-

## తెలంగాణా ' సెర్ప్ ' కు ఎఫ్ పి ఓలపై జాతీయ అవార్డు !



ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ నుంచి జాతీయ అవార్డు స్వీకరిస్తున్న తెలంగాణా సెర్ప్ సి ఓ ఓ ఎన్ రజిత

## ఏపిమాస్ కు ' రేస్ ఆఫ్ హోప్ 'తోడ్పాటు!




'రేస్ ఆఫ్ హోప్' ఒప్పంద పత్రాలతో శ్రీమతి నందితా రే, శ్రీ సి ఎస్ రెడ్డి, ప్రక్కన శ్రీమతి రామలక్ష్మి



ధీశాలి ఎఫ్ పి సి 5 వ వార్షిక మహాసభలో ప్రసంగిస్తున్న జిల్లా కలెక్టర్ శ్రీమతి పమేలా సత్పథి



అనంత ఎఫ్ పి ఓ లో జిల్లా కలెక్టర్ కొనుగోళ్ళు



ధరణి ఎఫ్ పి ఓ 4 వ వార్షిక మహాసభలో పాలకవర్గ సభ్యులు, యితర ప్రతినిధులు, ప్రముఖుల గ్రూప్ ఫోటో



ఎం టమాటో ఎఫ్ పి సి సమాఖ్య 4 వ వార్షిక మహాసభలో సమాఖ్య పాలకవర్గ సభ్యులు, ప్రతినిధులతో శ్రీ సి ఎస్ రెడ్డి



ఆజీవ ఎఫ్ పి సి 5 వ వార్షిక మహాసభలో ప్రసంగిస్తున్న నాబార్డ్ తెలంగాణా (ఆర్ ఓ) సి జి ఎం శ్రీమతి సుశీల చింతల


PRAGATI OFFSET ప్రగతి ఆఫ్‌సెట్

NABARD నాబార్డ్ సౌజన్యంతో ....

# రైతు ఉత్పత్తిదారుల సంఘాలు (ఎఫ్.పి.ఓ)

సహకారమే పునాదిగా సంఘాల బలోపేతం
సేవలే ఆధారంగా ప్రగతి దిశలో రైతుల పయనం

## చేపట్టే పనులు



# మహిళా సాధికారత


సంపుటి 21 సంచిక 2




సంపాదకీయం

## మహాసభలు !

ఏపిమాస్ మార్గదర్శకత్వంలో, ఈ సంస్థ అందిస్తున్న సాంకేతిక సహాయ సహకారాలతో ఉభయ తెలుగు రాష్ట్రాలలో ఏర్పాటైన ఎఫ్ పి ఓలు, ఎఫ్ పి సిలు (రైతు ఉత్పత్తిదారుల సంస్థలు) తమ వార్షిక మహాసభలను ఎంతో ఉత్సాహంగా జరుపుకుంటుండడం సంతోషకరమైన విషయం. సంస్థలను సుస్థిరాభివృద్ధి దిశగా, సభ్యులకు యితోధిక ప్రయోజనదాయకంగా, నాణ్యంగా, పారదర్శకంగా, నిత్యనూతనంగా నిర్వహించుకోవడం ఎంత ముఖ్యమో, చట్టబద్ధంగా అవసరమైన నియమనిబంధనలను పాటించడం, నిర్దేశిత కార్యక్రమాలను క్రమబద్ధంగా పూర్తిచేయడం కూడా అంతే ముఖ్యం. ఈ దృష్ట్యా ప్రతి ఏటా వార్షిక సర్వసభ్య మహాసభ నిర్వహణ తప్పనిసరి. ఆ నియమాన్ని అన్ని ఎఫ్ పి ఓలు, ఎఫ్ పి సిలు తూచా తప్పకుండా సకాలంలో పాటిస్తుండడం అభినందనీయం. ఏర్పాటై ఒకటి రెండు సంవత్సరాలు నిండిన సంస్థలు స్వయం నియంత్రణ స్ఫూర్తిని నింపుకుని, తమంతతాముగా ఈ మహాసభలను నిర్వహిస్తుండడం మరింత అభినందనీయమైన, ఆనందదాయకమైన విషయం. వార్షిక మహాసభలకు పూర్వరంగంగా అంతర్గత ఆడిట్ జరపడం, అర్హులైన నిర్ణీత ఆడిటర్లతో సంస్థ లెక్కలను ఆడిట్ చేయించడం మొదలైన ఆవశ్యకాంశాలను యథావిధిగా పాటిస్తుండడం, మహాసభలో చర్చించవలసిన, మహాసభ ఆమోదం పొందవలసిన అంశాలతో అజెండా రూపొందించుకుని దానికి అనుగుణంగా సభానిర్వహణ సాగిస్తుండడం మంచిదే. అవసరానుగుణంగా పాలకవర్గ సభ్యుల, పదాధికారుల ఎన్నికలు జరిపి సంస్థలకు కొత్త జవసత్వాలను కలిగిస్తుండడం కూడా మెచ్చుకోదగినదే. ఐతే, ఈ నిర్ణీత అంశాలను ప్రతి సంవత్సరం మూసపోసినట్టు ఒకేవిధంగా పాటించడం మాత్రమే కాకుండా, నిరుటికి – ఈ ఏడాదికి, ఈ సంవత్సరానికి–వచ్చే ఏడాదికి గుణాత్మకమైన పురోగతి మరింత ముఖ్యం. ఆ విషయమై తగిన శ్రద్ధ వహించడం ఎంతైనా అవసరం. జమాఖర్చులు, అంచనాలు, కొనుగోళ్ళు, అమ్మకాల వంటి సాంకేతికాంశాలు మాత్రమే కాకుండా తమ సంస్థలను నిత్యనూతనంగా , మరింత ఫలప్రదంగా పురోగమింపజేసే భవిష్యత్ దర్శనాన్ని ఈ వార్షిక మహాసభలు సభ్యులముందు వుంచగలిగితే, అనంతరం ఆ ఆశావహ సంకల్పాన్ని సాకారం చేసుకోగలిగితే ఈ మహాసభలు నిజంగా ఫలప్రదమైనట్టు. బడ్జెట్ల రూపకల్పనలో భారీతనం కాకుండా, ఏటికేడాది మరింత మెరుగైన ఫలితాలు సాధించడానికి అనువైన వాస్తవిక ప్రణాళికలను తయారుచేసుకోవాలి. అవసరమైన ఖర్చులు ఎటూ తప్పవు. కాని అంతగా అవసరంలేని ఖర్చులతో సంస్థలపై అధికభారాన్ని మోపడం, వచ్చే ఆదాయమంతా ఖర్చులకే సరిపోతుండడం సభ్యరైతులకు నిరుత్సాహం కలిగిస్తుంది. పెట్టే ప్రతి రూపాయి ఖర్చునుంచి ఎంతగా, ఎలా అధిక ఆదాయం సాధించవచ్చునో సంస్థలోని అందరూ కాకపోయినా, పాలకవర్గ సభ్యులు, సి ఇ ఓలు, పదాధికారులు ఆలోచించి ప్రణాళికలను రూపొందించి, అమలుచేయగలగాలి. నేటి సమాచార, సాంకేతిక విప్లవ ప్రపంచంలో అభివృద్ధికి ఆకాశమే హద్దు. కేవలం సాంప్రదాయికమైన పంటలు, ఉత్పత్తులే కాకుండా ఎప్పటికప్పుడు ఎన్నెన్నో కొత్త వ్యవసాయ విధానాలు, నైపుణ్యాలు, పరిచయంలేని పంటలు వెలుగు చూస్తున్నాయి. సరికొత్త విలువజోడింపు ప్రక్రియలు అందుబాటులో వుంటున్నాయి. గతంలో డ్రాగన్ ఫ్రూట్స్ గురించి మనకు ఏం తెలుసు ? కాని యిప్పుడు మన ప్రాంతాలలోనే వాటిని సాగుచేస్తూ ఎంతగానో లాభాలు ఆర్జిస్తున్నారు. ఇదొక్కటే కాదు, యిలాంటివి ఎన్నో! మన పంటపొలాలకు, మన వాతావరణానికి అనుకూలమైన , అధిక లాభదాయకమైన కొత్త పంటలను గురించి,మార్కెట్ సదుపాయాల గురించి ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ, ఒకేసారి విస్తృతంగా కాకుండా ప్రయోగాత్మకంగా వాటిని సాగుచేసి, ఫలితాలను పరిశీలించి ముందడుగు వేయాలి. నూతనత్వానికి, చైతన్యానికి, రైతుల పురోగతికి ఏపిమాస్ తోడ్పాటు ఎప్పుడూ వుంటుంది. ఎఫ్ పి ఓలు, ఎఫ్ పి సిలు అంటేనే వ్యాపారాత్మకవ్యవసాయ సంస్థలు. ఆ వ్యాపార దృక్పథం కొరవడితే, లాభాలను కాకుండా భారాలను పెంచుకుంటే యిక వాటి మనుగడ ప్రశ్నార్థకంకాదా? శ్రద్ధపెట్టవలసిన మరో ముఖ్యమైన అంశం తమ సంస్థలలో మహిళా ప్రాతినిధ్యాన్ని, నాయకత్వాన్ని పెంచడం. ఏపిమాస్ వార్షిక సర్వసభ్య సమావేశాలలో, పాలకవర్గ సభ్యుల ఎన్నికలలో మహిళా నాయకత్వానికి అత్యధిక ప్రాధాన్యం యిస్తున్నది. ఈ మహాసభలలో ఎఫ్ పి ఓల కార్యకలాపాల గురించి, ఆ సంస్థల కుటుంబాలలో పోషకాహారం,ఆరోగ్యం,పరిశుద్ధమైన నీరు, పారిశుద్ధ్యం, పరిశుభ్రత వంటి సమగ్రాభివృద్ధి సూచికలకు అధిక ప్రాధాన్యం యివ్వడాన్ని గురించి విస్తృతంగా చర్చ జరుతుంది. ఎఫ్ పి ఓలు, ఎఫ్ పి సిలే కాదు, అనేక రాష్ట్రాలలో ఎస్ హెచ్ జి సమాఖ్యలుకూడా మహాసభలు నిర్వహిస్తున్నాయి. ఏపిమాస్ వాటికి తోడ్పాటు అందిస్తున్నది.




Edited, Printed, Published and owned by **T.Chandra Sekhar Reddy;** Printed at Kala Jyothi Process Pvt.Limited, S No:185, Kondapur, Hyderabad-500133, Ranga Reddi District, Telangana;Published at Mahila Abhivruddhi Society, Andhra Pradesh (APMAS), Plot No.11&12,HUDAColony, Tanesha Nagar, Near DreamVally,Manikonda,Rangareddi District,Hyderabad-500089. **Editor:**T.Chandra Sekhar Reddy


బంగారు పాత్రలోని విషం కంటె మట్టి ముంతలోని తేనె మేలుకదా!

# మహిళా సాధికారత

ఎడిటర్ : **టి.చంద్రశేఖర రెడ్డి** అసోసియేట్ ఎడిటర్ : **జె.వి. క్రిష్ణమూర్తి**

ఎడిటోరియల్ కమిటి : ఏ. కళామణి, ఎస్. రామలక్ష్మి, ఎన్.వినాయకరెడ్డి, బి.వెంకటేశ్వర్లు

కంపోజింగ్, డిజైనింగ్ : ఎన్. రమాదేవి కన్సల్టెంట్ : కె.రఘురామరాజు

## లోపలి పేజీలలో ....

➪ కోలాహలంగా ఎఫ్ పి ఓల వార్షిక మహాసభలు! ...05
➪ ఏపిమాస్‌కు 'రేస్ ఆఫ్ హెూప్' తోడ్పాటు ! ...08
➪ మడకశిరలో ప్రపంచ వెదురు దినోత్సవం ! ...09
➪ ధరణి ఎఫ్.పి.ఓ నాల్గవ వార్షిక మహాసభ ...11
➪ 'సెర్ప్' కు ఎఫ్ పి ఓలపై జాతీయ అవార్డు ! ...13
➪ 'భూసంపద' ఎఫ్ పి సి వార్షికసమావేశం ...13
➪ మహిళా రైతులు పంటలను బ్రాండ్‌లా తేవాలి ...14
➪ నీళ్ళు తక్కువ తాగినా,ఎక్కువ తాగినా సమస్యే ...15
➪ వరికి చీడపీడలు ఆశించే తరుణం. బహుపరాక్!...16
➪ రైతులకు కాసులు కురిపించే కడక్‌నాథ్ కోళ్ళు! ...18
➪ జాతీయస్థాయిలో సహకార విశ్వవిద్యాలయం ...19
➪ బత్తాయిలో ఆశించే తెగుళ్ళు – యాజమాన్యం ...20
➪ చికెన్ ఉత్పత్తులకు విలువ జోడింపుపై శిక్షణ ...22
➪ బాహ్య పరాన్నజీవులద్వారా సోకే వ్యాధులు ...24
➪ పాడి పశువులలో పొదుగువాపు వ్యాధి నివారణ...26
➪ ఇండ్ బ్రో ఇంక్యుబేటర్ల సందర్శన ...28
➪ పశువుల గర్భధారణను తెలిపే పుణ్యకోటి పరీక్ష ...30
➪ రసాయనికం నుంచి ప్రకృతి వ్యవసాయానికి... ...31
➪ నీరు, ఆరోగ్యం, పరిశుభ్రతలపై అవగాహన ...33

## 'మహిళాభివృద్ధి సొసైటీ' (మాస్)

'మహిళా సాధికారత' పత్రిక మాతృసంస్థ మహిళాభివృద్ధి సొసైటీ. దీనిని ఏపిమాస్ అని, మాస్ అని కూడా సంక్షిప్తంగా పిలుస్తారు. 2001జూన్ 14 వ తేదీన పబ్లిక్ సొసైటీగా మహిళాభివృద్ధి సొసైటీ హైదరాబాద్ ప్రధాన కార్యాలయంగా ఏర్పాటైంది. తెలుగు రాష్ట్రాలలో, మన దేశంలోని ఇతర అనేక రాష్ట్రాలలో స్వయంసహాయ సంస్థల సుస్థిరాభివృద్ధికి విశేష సేవలను అందించిన ఈ సంస్థ ప్రస్తుతం రైతుల అభ్యున్నతికి, పర్యావరణ పరిరక్షణకు, ఆదర్శ గ్రామాల నిర్మాణానికి, స్వయంసహాయ సంస్థల స్వయం నియంత్రణకు గణనీయమైన కృషి చేస్తున్నది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ప్రధాన కార్యదర్శిగా పనిచేసి పదవీ విరమణ చేసిన శ్రీ కె. మాధవరావు ఛైర్మన్‌గా వివిధ రంగాలలో విశేషానుభవం గడించిన ప్రముఖులు ఈ సంస్థ పాలకవర్గంలో వున్నారు. సంస్థ వ్యవస్థాపక సి ఇ ఓ శ్రీ సి ఎస్ రెడ్డి ఎండి గా, సిఇఓ గా వున్నారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, బీహార్‌లలో కార్యక్రమాలను నిర్వహిస్తున్న ఈ సంస్థకు ప్రధాన కార్యాలయంతోపాటు, ఒక ప్రాంతీయ కార్యాలయం, 21 క్షేత్ర కార్యాలయాలు వున్నాయి. దాదాపు 250 మందికి పైగా సిబ్బంది వున్నారు. ప్రజలకు అవగాహన కలిగించడం కోసం మహిళా సాధికారత పత్రికతోపాటు వివిధ వైజ్ఞానిక పుస్తకాలను, ఈ సంస్థ ప్రచురిస్తుంటుంది.

| ప్రోత్సాహక చందా | | |
|---|---|---|
| ఏడాదికి | : | రూ. 110 |
| రెండేళ్ళకు | : | రూ. 200 |
| మూడేళ్ళకు | : | రూ. 280 |

| ప్రకటన ఛార్జీలు | |
|---|---|
| మల్టీకలర్ ఫస్ట్ పేజి (సగం)/బ్యాక్ పేజి(పూర్తి) | : రూ. 25,000 |
| మల్టీకలర్ ఇన్‌సైడ్ కవర్ పేజి (పూర్తి) | : రూ. 15,000 |
| బ్లాక్ అండ్ వైట్ లోపలి పేజి (పూర్తి) | : రూ. 10,000 |

**చందాలు లేదా ప్రకటనలకోసం పంపే డిడిలను 'ఏపిమాస్ -హైదరాబాద్' పేరుమీద పంపాలి**

మహిళా సాధికారత, ఏపిమాస్ కార్యాలయం, ప్లాట్ నెం.11-12, హుడా కాలని, తానీషా నగర్,
డ్రీమ్‌వ్యాలీ దగ్గర, మణికొండ, రంగారెడ్డి జిల్లా, హైదరాబాదు-500089. ఫోన్ : 08413-403118
Web: www.apmas.org, E Mail: info@apmas.org

మాట కనిపించని బాణం; గురి కుదిరితే ఆశించిన ఫలం, గురి తప్పితే గండం

# కోలాహలంగా ఎఫ్ పి ఓల వార్షిక మహాసభలు!

– ఎన్.వినాయక రెడ్డి, ఎస్.ప్రహల్లాద

రైతుల అభివృద్దే ధ్యేయంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, బీహార్ ఏపిమాస్ సన్న, చిన్నకారు రైతులతో ఎఫ్ పి ఓలను (రైతు ఉత్పత్తిదారు సంస్థలను) ఏర్పాటుచేసి అనేక అభివృద్ధి కార్యక్రమాలను విజయవంతంగా అమలు జరుపుతున్న విషయం 'మహిళా సాధికారత' పాఠకులకు సుపరిచితమే. ఈ ఎఫ్ పి ఓలు వివిధ దాతృత్వ సంస్థల ప్రోతాహంతో ఏర్పాటయ్యాయి. ఈ సంస్థలలో కొన్ని రాష్ట్రాల సహకార సంఘాల చట్టం ప్రకారం రిజిస్ట్రేషన్ కాగా మరికొన్ని ఉత్పత్తిదారు కంపెనీల చట్టం ప్రకారం నమోదు అయ్యాయి.

రైతుల అభివృద్ధికి వివిధ రకాల అభివృద్ధి కార్యక్రమాలను ముఖ్యంగా వ్యాపార కార్యక్రమాలను (ఇన్పుట్, ఔట్పుట్, వ్యవసాయ యంత్రాలు, యంత్ర పరికరాలు, రైతులకు ఉపయోగపడే ఇతర ఉత్పత్తులు) చేపట్టడం ఒక ఎత్తు అయితే సకాలంలో చట్టబద్ధమైన కార్యక్రమాలు పూర్తి చేయడం మరో ఎత్తు. ఈ రైతు ఉత్పత్తిదారు సంస్థలు ప్రతి ఆర్థిక సంవత్సరం మార్చి 31 నాటికి గడచిన ఆరు నెలల కాలానికి సంబంధించి కొన్ని చట్టబద్ధమైన కార్యక్రమాలు పూర్తి చేయవలసి వుంది. అవి ప్రధానంగా:

1. **లెక్కలను ఆడిట్ చేయించుట :** ప్రతి సంస్థ కూడా మొదటగా అంతర్గతంగా లెక్కలను తనిఖీ చేసి (ఇంటర్నల్ ఆడిట్), అనంతరం ఛార్టర్డ్ అకౌంటెంట్ ద్వారా ఆడిట్ చేయించి నివేదికలను సిద్ధం చేసుకోవాలి.
2. సంవత్సర వార్షిక ప్రగతి నివేదికలను , ఆర్థిక నివేదికలను సిద్ధం చేసుకోవాలి. ఆడిట్లో ఏవైన అభ్యంతరాలు ఉన్నట్లయితే వాటిని సవరించి నివేదికలను తయారు చేసుకోవాలి.
3. వార్షిక మహాసభలను నిర్వహించాలి. ఆ మహాసభలో నిబంధనావళి ప్రకారం కార్యవర్గ సభ్యులకు ఎన్నికలు జరిపించాలి.
4. వార్షిక మహాసభ తేది నుండి 30 రోజులలోపు సహకార సంఘాల చట్టం ప్రకారం రిజిస్ట్రేషన్ అయిన సంస్థలు జిల్లా సహకార శాఖ వారికి, కంపెనీల చట్టం ప్రకారం రిజిస్ట్రేషన్ అయిన సంస్థలు కంపెనీ సెక్రెటరి ద్వారా రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్ వారికి దఖలు పరచాలి.

**ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మహోత్సవంగా మహాసభలు**

ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రస్తుతం చిత్తూరు, అన్నమయ్య, తిరుపతి అనే మూడు జిల్లాలుగా రూపొందింది. ఈ జిల్లాల పరిధిలో ఏపిమాస్ వివిధ ప్రోత్సాహక సంస్థల సహాయంతో (జి ఐ సి, ఎన్ సి డి సి, నాబార్డ్, ఎస్ ఎఫ్ ఏ సి, రాష్ట్రప్రభుత్వ ఉద్యాన వ్యవసాయశాఖ, సంపూర్ణ) 24 రైతు ఉత్పత్తిదారుల సంస్థలను ఏర్పాటు చేసింది. ఈ సంస్థలలో 2022 మార్చి 31 నాటికి మొత్తం సభ్యుల సంఖ్య : 13,242 ఇందులో మహిళలు 4329 (అనగా 33 శాతం) వున్నారు. ఈ 33 శాతం మహిళా ప్రాతినిధ్యాన్ని 50 శాతానికి పెంచాలన్నది ఏపిమాస్ సంకల్పం, ఈ విషయాన్ని అన్ని వార్షిక మహాసభలలో తెలియజేయడం జరిగింది.

ఈ ఏడాది ఈ 24 ఎఫ్ పి ఓ / ఎఫ్ పి సి ల వార్షిక మహాసభల నిర్వహణ జూన్ 15వ తేదీన ప్రారంభమై సెప్టెంబరు 20వ తేదీతో ముగిసింది. (సంస్థల వారీగా మహాసభల నిర్వహణ వివరాలు ప్రక్క పేజీలో చూడవచ్చు.)

మహాసభలు నిర్వహించిన అన్ని సంస్థలు ఈ క్రింది అజెండా అంశాలను చర్చించి తీర్మానాలను ఆమోదించాయి:

(1) సంస్థ ప్రతినిధులకు, అతిధులకు ఆహ్వానం (2) జ్యోతి ప్రజ్వలన (3) ప్రార్థన (4) 2021–22సంవత్సరపు ప్రగతి నివేదిక సమర్పణ –ఆమోదం (5) 2021–22 సంవత్సరపు అడిట్ నివేదిక సమర్పణ, ఆమోదం (6) 2022–23 సంవత్సరపు కార్యాచరణ ప్రణాళికపై చర్చ–ఆమోదం (7) 2022–23 సంవత్సరపు బడ్జెట్పై

చర్చ– ఆమోదం (8) మిగులు నిధుల పంపిణీ –చర్చ ఆమోదం (9) సభ్యత్వం–వాటా ధనంపై చర్చ ఆమోదం (10) ఆడిటర్ నియామకం–తీర్మానం (11) పాలక వర్గ సభ్యుల ఎన్నికలు – ప్రమాణ స్వీకారం (12)ప్రత్యేక ఆహ్వానితుల సందేశం (13) మహాసభ ఆమోదంతో ఇతర కార్యక్రమాలు (14) సి.ఈ.ఓచే వందన సమర్పణ – సమావేశం ముగింపు.

సిబిబిఓ ప్రాజెక్టు ద్వారా మంజూరైన సంస్థలలో ఈక్విటి నిధుల కొరకు అదనపు ధృవీకరణ పత్రాలు పంపిణీ కార్యక్రమాలు కూడా జరిగాయి

**ప్రభుత్వ అధికారులు పాల్గొనడం**

ప్రతి రైతు ఉత్పత్తిదారు సంస్థ కూడా తనకు తానుగా సుస్థిరత సాధించాలన్నది ఏపిమాస్ ప్రోత్సాహక విధానం. అందువల్ల రైతు ఉత్పత్తిదారు సంస్థల కార్యక్రమాలలో ఒకవైపు ప్రభుత్వ ప్రతినిధులు, మరోవైపు స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు తప్పక పాల్గొనేలా చేయాలని ఏపిమాస్ కృషి చేస్తున్నది.

ఇందుకు అనుగుణంగా, ప్రతి మండల స్థాయి రైతు ఉత్పత్తిదారు సంస్థ వార్షిక మహాసభలలో స్థానిక ప్రభుత్వ అధికారుల (వ్యవసాయశాఖ, ఉద్యాన శాఖ, పశు వైద్యశాఖ, మండల అభివృద్ధి అధికారి, మొదలగువారు)తో పాటు రైతుల కొరకు వివిధ రకాల ఎరువులు, క్రిమి సంహార మందులను ఉత్పత్తిచేసే కంపెనీల ప్రతినిధులు కూడా హాజరై వారి ఉత్పత్తులను , రైతుల కొరకు వారు అందించే వివిధ సేవలను తెలియ జేసేలా కార్యక్రమాలను రూపొందిస్తున్నది.

| క్ర.స. | రైతు ఉత్పత్తి దారు సంస్థ పేరు | మహాసభ తేది |
|---|---|---|
| 1. | కౌండిన్య రైతు ఉత్పత్తి దారుల కంపెని – పలమనేరు – | 15.07.2022 |
| 2. | బైరెడ్డిపల్లి రైతు ఉత్పత్తిదారుల సహకార సంఘం – | 17.06.2022 |
| 3. | వి.కోట వ్యవసాయ ఉత్పత్తిదారుల ఎంఎసిఎఫ్ – | 25.07.2022 |
| 4. | వేంకటగిరి కోట రైతు ఉత్పత్తి దారుల ఎంఎసిఎస్ – | 25.07.2022 |
| 5. | కలికిరి రైతు ఉత్పత్తిదారుల ఎంఎసిఎస్ – | 08.08.2022 |
| 6. | కురబలకోట మహిళా రైతు ఉత్పత్తిదారుల ఎంఎసిఎస్ – | 19.08.2022 |
| 7. | సోమాల రైతు ఉత్పత్తిదారుల ఎంఎసిఎస్ వ – | 22.08.2022 |
| 8. | పీలేరు రైతు ఉత్పత్తిదారుల కంపెని – | 23.08.2022 |
| 9. | వాల్మీకిపురం రైతు ఉత్పత్తిదారుల ఎంఎసిఎస్ – | 24.08.2022 |
| 10. | తంబళ్లపల్లి రైతు ఉత్పత్తిదారుల ఎంఎసిఎస్ – | 24.08.2022 |
| 11. | కామధేను రైతు ఉత్పత్తిదారుల కంపెని–పెద్దమండ్యం – | 26.08.2022 |
| 12. | పెద్దతిప్ప సముద్రం రైతు ఉత్పత్తిదారుల ఎంఎసిఎస్ – | 30.08.2022 |
| 13. | నిమ్మనపల్లి రైతు ఉత్పత్తిదారుల కంపెని – | 02.09.2022 |
| 14. | రామసముద్రం రైతు ఉత్పత్తిదారుల ఎంఎసిఎస్ – | 06.09.2022 |
| 15. | సదుం రైతు ఉత్పత్తిదారుల ఎంఎసిఎస్ – | 09.09.2022 |
| 16. | మర్యాదరామన్నపట్నం రైతు ఉత్పత్తిదారుల కంపెని మదనపల్లి | 10.09.2022 |
| 17. | రామచంద్రాపురం రైతు ఉత్పత్తిదారుల కంపెని – | 10.09.2022 |
| 18. | ఎం.టమాట రైతు ఉత్పత్తిదారుల కంపెని మదనపల్లి – | 13.09.2022 |
| 19. | హార్సిలీహిల్స్ రైతు ఉత్పత్తిదారుల కంపెని బి.కొత్తకోట – | 15.09.2022 |
| 20. | సోమల మల్లేశ్వర స్వామి రైతు ఉత్పత్తిదారుల ఎంఎసిఎస్– | 15.09.2022 |
| 21. | రెడ్డెమ్మ రైతు ఉత్పత్తిదారుల కంపెని – కలకడ – | 16.09.2022 |
| 22. | శ్రీ సుగుటూరు గంగమ్మ రైతు ఉత్పత్తిదారుల ఎంఎసిఎస్ – | 17.09.2022 |
| 23. | నాగులాపురం రైతు ఉత్పత్తిదారుల ఎంఎసిఎస్ – | 19.09.2022 |
| 24. | విజయపురం రైతు ఉత్పత్తిదారుల ఎంఎసిఎస్ – | 20.09.2022 |

**ఎం.టమాట మహాసభ**

13-09-2022వ తేదీన మదనపల్లి ప్రాంతంలోని రైతు ఉత్పత్తిదారుల సంస్థలతో ఏర్పడిన సమాఖ్య 'ఎం.టమాట' రైతు ఉత్పత్తి దారుల కంపెనీ వార్షిక మహాసభ పండుగ వాతావరణంలో జరిగింది.

**నవ్వు సంతోషానికి సంకేతం కాకపోవచ్చు ; ఆత్మవిశ్వాసానికి, ఆశాభావానికి చిహ్నం**

ఈ సమావేశంలో ఏపిమాస్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి శ్రీ సి.ఎస్.రెడ్డి పాల్గొని దేశంలో అమలులో వున్న వివిధ రైతు ఉత్పత్తిదారు సంస్థల కార్యక్రమాలను, ఏపిమాస్ ప్రోత్సహిస్తున్న సంస్థలలో చేపట్టిన చర్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యామ్నాయ ఇంధన వనరులను రైతులకు అందించే సంస్థ 'సేల్కో' వారు పాల్గొని రైతులకు వారు అందించే వివిధ రకాల సోలార్ పరికరాలైన – స్ప్రేయర్లు, పాలు పితికే యంత్రాలు, ట్రాప్స్ మొదలగు వాటి గురించి వివరించారు. ఈ సమావేశానికి 23 రైతు ఉత్పత్తి దారుల సంస్థల నుండి దాదాపు 300 మంది సభ్యులు, 50 మంది ఇతర ప్రతినిధులు హాజరు కావడం విశేషం.

**ఉద్యాన పంటలకు ప్రోత్సాహం :** ఈ కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా ఉద్యానశాఖ అధికారి శ్రీ రవిచంద్రబాబు పాల్గొని, వారి శాఖ ద్వారా రైతులకు అందించే వివిధ రకాల సేవలను తెలియ జేశారు.

**ప్రకృతి వ్యవసాయ ప్రోత్సాహక అధికారులు :** ఈ సమావేశంలో ప్రకృతి వ్యవసాయ ప్రోత్సాహక జిల్లా స్థాయి అధికారులు వారి క్షేత్ర స్థాయి సిబ్బంది పాల్గొని వారి శాఖ ద్వారా రైతులకు అందించే వివిధ సేవలను తెలియజేశారు.

**వార్షిక మహాసభలలో కీలక పాత్ర :** ఏపిమాస్ సిఈఓ శ్రీ సి.ఎస్.రెడ్డి గారి సూచనల మేరకు ప్రాజెక్ట్ సంచాలకులు శ్రీ వినాయకరెడ్డి మార్గదర్శకత్వంలో ప్రాజెక్ట్ మేనేజర్లు, సాంకేతిక అధికారులు, ఎఫ్‌పిఓ సిఈఓ ల భాగస్వామ్యంతో అన్ని మండలాలలో వార్షిక మహాసభలు విజయవంతం అయ్యాయి. ప్రతి మండలంలో కూడా రైతు ఉత్పత్తిదారు సంస్థల పాలకవర్గ సభ్యులు, ఇతర రైతులు చురుకుగా పాల్గొనడం కూడా ఈ వార్షిక మహాసభల విజయవంతానికి దోహదపడ్డాయి.

**ఈ మహాసభల ద్వారా నేర్చుకున్న అంశాలు :**

- రైతు ఉత్పత్తిదారు సంస్థలపై రైతులకున్న ఆసక్తి బయటపడింది.
- సభ్య రైతులకు అందించే వివిధ రకాల సేవలు అందరికి తెలియజేయడం జరిగింది.



- ప్రభుత్వ అధికారులకు, రైతు సంఘాల సభ్యులకు మధ్య అనుసంధానం ఏర్పడింది.
- వివిధ మండల స్థాయి రైతు ఉత్పత్తిదారు సంస్థల మధ్య సమన్వయం, సహకారం, అనుభవాల పంపిణీకి దోహదం చేశాయి. ■

## సదుం ఎఫ్‌పిఓ రెండవ వార్షిక సమావేశం

సదుం ఎంపిడిఓ సమావేశ మందిరంలో సదుం ఎఫ్‌పిఓ రెండవ వార్షిక సమావేశం 09-09-2022 తేదీన జరిగింది ఈ సమావేశంలో 80 మంది సభ్య రైతులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో చిత్తూరు డిహెచ్ఓ శ్రీ మధుసూదనరెడ్డి మాట్లాడుతూ గ్రామాలలో గ్రామస్థాయి సమావేశాలు ఏర్పాటుచేసి రైతులకు ఎఫ్‌పిఓ గురించి పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే రైతు సేవా కేంద్రంలో పూర్తి స్థాయిలో రైతులకు అవసరమైన ఉత్పత్తులను అందుబాటులో ఉంచాలని సూచించారు. అలాగే ఎఫ్‌పిఓకు కావలసిన అన్ని రకాల ప్రభుత్వ సహకారం అందిస్తామని తెలియజేశారు.

ఈ సమావేశంలో హెచ్ సంతోషి కుమారి, అధ్యక్షులు శ్రీ టి. సోమశేఖర్ రెడ్డి, పాలకవర్గ సభ్యులు, ఏపిమాస్ ప్రాజెక్ట్ మేనేజర్లు డా॥ ప్రహ్లాద, డా॥ భార్గవి, డా॥ గంగాద్రి, ఇంకా ఎస్ఎం నాగేంద్ర, సిఇఓ లు వందన, కార్తికేయ కుమార్ హరిత పాల్గొన్నారు. ఏపిమాస్ ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీ ప్రహ్లాద ఈ మహాసభకు సమన్వయకర్తగా వ్యవహరించారు. ఈ సమావేశంలో మొదటగా సంఘ ప్రోగ్రెస్ రిపోర్ట్ ఆడిట్ రిపోర్ట్ చదివి సభ ఆమోదం పొందడం జరిగినది. ఆ తర్వాత కొత్త కార్యవర్గం ఎన్నిక, 2022-23 వార్షిక ప్రణాళిక , వార్షిక అంచనాలు చదివి మహాసభ ఆమోదం పొందారు. ■

# ఏపిమాస్‌కు 'రేస్ ఆఫ్ హొూప్' తోడ్పాటు !

-లిఖిత శ్రీరామ్

**ఉ**మ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వంలో ముఖ్య కార్యదర్శిగా పని చేసిన ఐ ఏ ఎస్ అధికారి శ్రీ స్మరజిత్ రే, ఆయన భార్య శ్రీమతి నందితా రే దంపతులకు ఏపిమాస్‌తో ఎంతో ఆత్మీయ అనుబంధం. ఏపిమాస్ ఏర్పాటులోను, అనంతరం అది మహిళల, పేదల సేవలో ఉత్తమ స్వచ్ఛంద సంస్థగా జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదగడంలోను ఈ దంపతుల పాత్ర కూడా చెప్పుకోదగినదే. శ్రీ స్మరజిత్ రే పశ్చిమ బెంగాల్‌కు చెందినవారైనప్పటికీ, ఆయన జీవితం ఆంధ్రప్రదేశ్‌తోనే ముడిపడింది. గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి చేయడం, పేదల జీవితాలను మెరుగుపరచడం ఆయన నమ్మిన సిద్ధాంతాలు, అంకితభావంతో అనుసరించిన మార్గాలు. ఆయన భార్య శ్రీమతి నందితా రే కూడా ఆయన సేవాతత్పరతను అన్నివిధాల ప్రోత్సహించి తానూ అదే మార్గంలో సేవానిరతిని చాటుకున్న ఉత్తమ మహిళ.

విదేశాలలో ఉన్నత చదువులు చదివి శ్రీ స్మరజిత్ రేను వివాహమాడిన పిదప ఈ దంపతులు గ్రామీణ సమస్యలపై అధ్యయనం చేసి, గ్రామీణ ప్రజల జీవనాన్ని మెరుగుపర్చటానికి తాము ఎన్నో ప్రభుత్వేతర, స్వచ్ఛంద సంస్థలలో భాగస్వాములై ఎన్నో సేవా కార్యక్రమాలు చేపడుతూ వచ్చారు. ఆ కోవలోనే ఏపిమాస్ ఏర్పాటులో వీరు భాగస్వాములైనారు. శ్రీమతి నందితా రే ఏపిమాస్ పాలకవర్గ సభ్యురాలిగా, వైస్ ఛైర్మన్‌గా కూడా కొంతకాలం పనిచేశారు. ఇంతేకాకుండా కో- ఆపరేటివ్ ఫౌండేషన్, అవుట్ రీచ్ సంస్థలలో ఛైర్‌పర్సన్‌గా, ఇంటర్ కో-ఆపరేషన్ సోషల్ డెవలప్‌మెంట్ , టింబక్టు ఫౌండేషన్ లాంటి సంస్థలలో వివిధ పదవులతో వివిధ సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు.

శ్రీ స్మరజిత్ రే దంపతుల సేవాభావాన్ని, ఏపిమాస్ కు వారి తోడ్పాటును దృష్టిలోవుంచుకుని శ్రీ స్మరజిత్ రే మరణానంతరం ఆయనపేరిట ప్రతిసంవత్సరం స్మరజిత్ రే స్మారక ప్రసంగాలను, చర్చాగోష్ఠి వంటి కార్యక్రమాలను ఏపిమాస్ నిర్వహిస్తూ వస్తున్నది.

**ఏపిమాస్‌కు భూరి విరాళం**

ఏపిమాస్ పాలకవర్గ సభ్యురాలిగా, వైస్ ఛైర్మన్‌గా ఏపిమాస్ పేదలకు, మహిళలకు, రైతులకు, ఇతర వివిధ రంగాలలోను చేస్తున్న విశిష్ట సేవలను గమనిస్తున్న శ్రీమతి నందితారే ఏపిమాస్‌కు ఐదు సంవత్సరాల పాటు విరాళం ఇవ్వటానికి ముందుకు వచ్చారు. 2022 ఆగష్టులో ఈ మేరకు ఏపిమాస్ తో ఒక ఒప్పందం చేసుకొని 'రేస్ ఆఫ్ హొూప్' పేరిట మొదటి సంవత్సరానికి గాను 15 లక్షల రూపాయలను విరాళంగా ఇచ్చారు. మిగతా నాలుగు సంవత్సరాలు కూడా యిలాగే విరాళం ఇవ్వనున్నారు.

'రేస్ ఆఫ్ హొూప్' అందించే విరాళాలను ఈ క్రింద పేర్కొన్న కార్యక్రమాల నిర్వహణకు వినియోగించాలన్నది ఒప్పందం సారాంశం.

- ప్రతి సంవత్సరం కీ.శే. స్మరజిత్ రే స్మారక కార్యక్రమం నిర్వహించడం
- రైతులు వినూత్న సహజ వ్యవసాయ పద్ధతులను అవలంబించడానికి, సస్యరక్షణ పద్ధతులను పెంపొందించుకోడానికి వారికి అధునాతన వ్యవసాయ పద్ధతులపైన శిక్షణలు యివ్వడం
- ఏపిమాస్ ఆధ్వర్యంలోని సంస్థలలో మహిళా నాయకత్వాన్ని పెంపొందించటం, మహిళలచే బయో రిసోర్స్ సెంటర్ ఏర్పాటు
- వ్యవసాయ జీవావరణాన్ని ప్రోత్సహించటం

ఏపిమాస్‌తో కలసి ఈ కార్యక్రమాలను చేయడం ఎంతో సంతోషంగా ఉందని శ్రీమతి నందితారే పేర్కొన్నారు. చక్కని సేవాదృక్పథంతో ఏపిమాస్‌కు అందిస్తున్న సహకారానికి ఏపిమాస్ సి.ఇ.ఓ శ్రీ సి.యస్ రెడ్డి, పాలకవర్గం, సిబ్బంది శ్రీమతి నందితా రేను అభినందించారు. ■

విజయగాథలు తెలివికి పదునుపెట్టలేవు, పరాజయ కారణాలే ఆలోచనలను రేకెత్తిస్తాయి

# మడకశిరలో ప్రపంచ వెదురు దినోత్సవం !

– గోపాలరాజు, (ప్రాజెక్ట్ మేనేజర్, అనిల్‌కుమార్, అగ్రికల్చర్ ఆఫీసర్

**మ**డకశిర ప్రభుత్వ డిగ్రీ, పీజీ కాలేజిలో సెప్టెంబర్ 17వ తేదీన ప్రపంచ వెదురు దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా క్లైమేట్ స్మార్ట్ విల్లేజ్ ప్రాజెక్ట్ సిబ్బంది ప్రాజెక్ట్ మేనేజర్ గోపాలరాజు, అగ్రికల్చర్ ఆఫీసర్ అనిల్‌కుమార్ పాల్గొని విద్యార్థులకు వెదురు ప్రాముఖ్యతను, వాటి నుండి వచ్చే లాభాల గురించి చెప్పి, వెదురు సాగు గురించి, వెదురు చెట్టు ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించడం జరిగింది.

కళాశాలలో వృక్ష శాస్త్రవేత్త డాక్టర్ అనిల్‌కుమార్, కళాశాల ప్రిన్సిపాల్, కళాశాల సిబ్బంది అందరు కూడా వెదురు పుట్టుక, దాని జీవిత చరిత్ర గురించి విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఒక వెదురు చెట్టును కూడా కళాశాల ఆవరణలో నాటారు.

**పచ్చ బంగారం**

వెదురును ఈమధ్య కాలంలో 'పచ్చ బంగారం'మని, పేదవాడి కలప అని కూడా పిలుస్తున్నారు. వెదురు సామాన్యంగా సహజమైన అడవులలో పెరుగుతుంది. వెదురులో ముఖ్యంగా 130 జాతులు వున్నాయి. అందులో గట్టి వెదురు, గుల్ల లేదా బోలు వెదురు అనే రెండు రకాలు ముఖ్యమైనవి, ఇప్పుడు మార్కెట్‌లో వెదురుకు గిరాకీ పెరిగిపోవడం వల్ల ఈ పంటను ముఖ్యమైన పంటగా వ్యవసాయ భూములలో కూడా పండిస్తున్నారు. దీనిని చాలా రకాలుగా ఉపయోగిస్తున్నారు.

ముఖ్యంగా దీనిని పేపర్ తయారీకి, ఇంటి సామాగ్రికి, ఆట వస్తువులుగా, సిమెంట్ ఫ్యాక్టరీలలో, వ్యవసాయ పనిముట్లుగా, గృహాలంకారంగా కూడా ఉపయోగిస్తున్నారు.

**నాటే పద్ధతి**

వెదురును ప్రధాన పంటగా, పొలం గట్ల పైన పొలానికి చుట్టూ కంచె పంటగా కూడా పండించవచ్చు. చెట్టుకు చెట్టుకు మధ్య 4 మీటర్ల ఎడంగా నాటుకోవచ్చు. ప్రధాన పొలంలో నాటేటప్పుడు 5-4 మీటర్ల ఎడం పాటించాలి. అలాగే గుంతలను 30*30*30 సెంటి మీటర్లు తీయాలి. గుంతలో 4 కిలోల పశువుల ఎరువు, 0.5 కేజీ వేపపిండి కలిపి చెట్టును నాటుకోవాలి. ఈ పంటను ముఖ్యంగా వర్షా కాలంలో అనగా జూన్, జూలై మాసాలలో నాటుకోవాలి. ఆ సమయంలో నాటడంవల్ల మొక్కలు ఏపుగా పెరుగుతాయి.

**తోటగా నాటకొన్నప్పుడు :**

ప్రధాన పొలంలో తోటలాగ నాటుకొన్నప్పుడు 1-2 సంవత్సరాలు అంతర పంటలు వేసుకోవచ్చు. వెదురు తన జీవిత కాలంలో ఒకసారి మాత్రమే పూతకు వచ్చి విత్తనాలు యిచ్చి కుదురు చనిపోతుంది. ఒక్కో కుదురు నుంచి 20-25 గెడలు వస్తాయి. వేసవి కాలంలో నెలకు ఒకసారి నీటి సౌకర్యం కల్పించాలి. నీటి సౌకర్యం కల్పించడం వలన దిగుబడిని పెంచుకోవచ్చు. వెదురు నాటిన 4 సంవత్సరాలకు మొదటిసారి నరికి పంటను తీసుకోవచ్చు. వెదురు రోజుకు 1 మీటర్ అనగా గంటకు 4 సెంటీ మీటర్లు పెరుగుతుంది. వెదురు భూమిమీద అతి త్వరగా పెరిగే మొక్కగా పేరు పొందింది. 4 ఏళ్ల నుంచి వరుసగా ఒక కుదురు నుండి 10 గెడలు చొప్పున ఏడాదికి 200 కుదుళ్ళ నుంచి 2000 గెడలు వస్తాయి. ఒక్కో గెడకు 20 రూపాయల చొప్పున ఎకరాకు 40 వేలు ఆదాయం పొందవచ్చు. ఇలా 25 ఏళ్ల వరకు దిగుబడి పొందవచ్చు. వెదురులో ఇలాంటి లాభాలే కాకుండా ఇంకా ఎన్నో లాభాలు కలవు. అందులో ముఖ్యంగా వెదురు మొక్క ఎక్కువుగా కార్బన్‌ను తీసుకొని ఆక్సిజన్‌ను ఇస్తుంది.

ఈ ప్రధాన లాభంగా మనం ఉద్దేశించి ఏపిమాస్ నిర్వహిస్తున్న క్లైమేట్ స్మార్ట్ విలేజ్ ప్రాజెక్ట్‌లో భాగంగా గుడిబండ మండలంలోని డెమో రైతులు , ప్రాజెక్ట్ సిబ్బంది అందరు కలసి తమిళనాడు హోసూర్‌లోని గ్రోమోర్ బయో

నీ మాట నిజమైతే అభినందించేవారు కొందరే, నిజం కాకుంటే నిందించేవారు ఎందరో



టెక్ వారి టిష్యూ కల్చర్ ల్యాబ్ ను సందర్శించాము. అక్కడ డాక్టర్ భారతి అనే శాస్త్రవేత్త వెదురు జీవిత చరిత్రను, మార్కెట్ సదుపాయాలను, వేరే దేశాలకు ఎగుమతి గురించి పూర్తిగా వివరించారు. అక్కడ టిష్యూ కల్చర్ ల్యాబ్‌లో వెదురు మొక్కలను ఏ విధంగా పెంచుతారో కూడా మా బృందం గమనించింది.

**క్లైమేట్ స్మార్ట్ విలేజ్ ప్రాజెక్ట్ లో వెదురు సాగుకు ప్రోత్సాహం**

క్లైమేట్ స్మార్ట్ విలేజ్ప్రాజెక్ట్ ద్వారా సాగుచేసుకొనే రైతులకు వెదురు మొక్కలను యివ్వడం జరుగుతున్నది. ఇందుకు కారణం వెదురు కార్బన్‌ను తీసుకొని ఆక్సిజన్ వదలడం వలన వాతావరణంలోని ఉష్ణాన్ని తగ్గిస్తూ వాతావరణ పరిరక్షణకు తోడ్పడే మొక్క కావడం. క్లైమేట్ స్మార్ట్ విలేజ్ ప్రాజెక్ట్‌లో భాగంగా పొలం గట్లపైన వెదురు నాటుకోడానికి వీలు కలిగిస్తున్నాం. ఇందుకోసమే ఆదర్శ రైతులను సందర్శన యాత్రకు తీసుకెళ్ళడం జరిగింది.

**రైతులు వెదురు నాటడం వల్ల లాభాలు**

- వెదురు పంటను ఎలాంటి నేలలోనైనా సాగు చెయ్యవచ్చు. సాధారణ వ్యవసాయానికి పనికిరాని చౌడు భూములు, ఇసుక భూములలోకూడా సాగు చేయవచ్చు.
- వెదురు సాగుకు ప్రత్యేకమైన చర్యలు అవసరం లేదు కావున రైతుకు ఎలాంటి పెట్టుబడి ఖర్చు ఉండదు.
- వెదురుసాగు నేలకోత, నీటికోత జరగకుండా కాపాడుతుంది.
- ప్రతి ఏడాది మంచి దిగుబడి ఇస్తుంది.
- వాతావరణంలోని వేడిని తగ్గించి ఉష్ణోగ్రత నుండి రక్షిస్తుంది.
- వాతావరణంలో కార్బన్ శాతాన్ని తగ్గిస్తుంది.
- మంచి కలపగా ఉపయోగపడుతుంది.
- ఎంతోమందికి జీవనోపాధిని కల్గిస్తుంది. ■

## అమెరికాలో పాఠంగా మారిన భారతీయ అటవీ యోధుడు జాదవ్ !



**భా**రతదేశ అటవీ యోధుడుగా పేరు సంపాదించుకున్న జాదవ్ భా పాయేంగ్ గురించి అమెరికా విద్యార్థులు ఇకపై తమ పాఠ్య పుస్తకాల్లో చదువుకోనున్నారు. నాలుగు దశాబ్దాలపాటు ఒక్కడే కష్టపడి 550 ఎకరాల బీడు భూమిని అందమైన అడవిగా మార్చి ఘనత సాధించిన పాయేంగ్ గురించి బ్రిస్టల్ కనెక్టికట్లో గ్రీనే హిల్స్ స్కూల్లోని ఆరో తరగతి విద్యార్థులు చదువుకోబోతున్నారు.

57 ఏళ్ల ఈ అస్సామీ రైతు సాధించిన ఎన్నో ఘనతల్లో ఇది గొప్పగా నిలవనుంది. పర్యావరణ పాఠ్యాంశాల్లో భాగంగా భవిష్యత్ తరాలకు స్ఫూర్తిని ఇచ్చేందుకు జాదవ్ పాయేంగ్ గురించి చేర్చినట్లు గ్రీనే హిల్స్ స్కూల్ టీచర్ నవమి శర్మ తెలిపారు.

అసలైన సంకల్పం, దృఢ నిశ్చయం ఉంటే ప్రపంచాన్ని మార్చడానికి ఒంటరిగానైనా ప్రయత్నించవచ్చని నిరూపించిన జాదవ్ తూర్పు అస్సాంలోని మాజులీ ద్వీపం క్రమేణా నీటి కోతకు గురైపోతుండడాన్ని తగ్గించడానికి ఆ చుట్టుపక్కల ఉన్న బీడు భూమిని దట్టమైన అరణ్యంగా మలిచాడు. ఇప్పుడు ఆ అడవిలో ఏనుగులు, జింకలు, ఖడ్గమృగాలు, పులులు, ఇంకా ఎన్నో జంతువులు నివసిస్తున్నాయి. ■

పని భారానికి ఆసక్తే కొలమానం; ఆసక్తి వుంటే కష్టమైనా సులువే, అదే లేకుంటే సులువైనా కష్టమే

# ఉత్సాహంగా ధరణి ఎఫ్.పి.ఓ నాల్గవ వార్షిక మహాసభ

– జి. శ్రీనివాస్




కామారెడ్డి జిల్లాల్లోని సదాశివనగర్ మండలంలో 'ధరణి వ్యవసాయ ఉత్పత్తిదారుల పరస్పర సహాయక సహకార సంఘం లిమిటెడ్ (ధరణి ఎఫ్.పి.ఓ)' చట్టప్రకారం చేయాల్సిన కార్యక్రమాలలో భాగంగా ధరణి ఎఫ్.పి.ఓ నాల్గవ వార్షిక మహాసభను 06 సెప్టెంబర్ 2022న కన్నుల పండుగలా జరుపుకున్నారు. మహాసభకు పది పంచాయతీలలోని సభ్యులు, గ్రామ రైతు సంఘం పదాధికారులు, పాలకవర్గం సభ్యులు , వారి సిబ్బంది, రైతు మిత్రలు అందరు కలిపి దాదాపు 325 మంది పాల్గొన్నారు. ఈ మహాసభను పద్మాజివాడిలోని రైతు వేదిక భవనంలో జరుపుకున్నారు.

వారు ముందుగా తయారు చేసుకున్న ఎజెండావారీగా ఎంతో చక్కగా చర్చించుకున్నారు. ఇందులో ముఖ్యంగా గత సంవత్సరం చేసిన కార్యక్రమాలు, సాధించిన ఫలితాలు, ఆడిట్ నివేదిక, రాబోవు సంవత్సరంలో చేయబోవు కార్యక్రమాలను సభకు తెలిపి ఆమోదం తీసుకున్నారు. స్వయం నియంత్రణ ఉద్యమ స్ఫూర్తితో రహస్య ఓటింగ్ పద్ధతి ప్రకారం ఎలాంటి ఇబ్బంది లేకుండా చక్కగా కొత్త పాలకవర్గాన్ని , పదాధికారులను ఎన్నుకున్నారు. గత సంవత్సరంలో పని చేసిన పాలకవర్గం, పదాధికారుల సేవలను కొనియాడారు. నూతనంగా ఎంపిక అయిన వారిని అభినందించారు. వారిచే ప్రమాణ స్వీకారం చేయించారు.

ఎఫ్.డి.సి, రైతు సేవా కేంద్రం ద్వారా సభ్యులకు అందు తున్న సేవల గురించి, వివిధ వ్యాపార కార్యక్రమాల గురించి, వరి, మక్కల కొనుగోలు కేంద్రాల గురించి చర్చించారు. ఇతర సంస్థలతో అనుసంధానంలో భాగంగా ఇ- ఫ్రెష్, కోరమండల్, మన గ్రోమోర్, అక్షయపాత్ర ఫౌండేషన్ వాళ్ళతో అనుసంధానమై, నూతన డీలర్ షిప్ తీసుకొని రైతు సంఘాల సభ్యులకు సేవలు అందించటానికి తీర్మానం చేసుకున్నారు. ధరణి ఎఫ్.పి.ఓ లో మహిళా సభ్యుల శాతం పెంచాలని, మహిళా నాయకత్వంపై పని చేయాలని, నూతన గ్రామాలలో సభ్యత్వ నమోదు చేయాలని తీర్మానించారు.

వారు సంకల్పించిన విజన్ సాధించటానికి కొన్ని కమిటీలను ఏర్పాటు చేసుకొని అందరిని భాగస్వాములుగా చేసుకొని ముందుకు వెళ్ళాలని అనుకున్నారు. విజన్ సాధించటంలో ఏపిమాస్ , యస్.వి.పి సంస్థల సహకారం ఎంతైనా అవసరమని భావిస్తూ వారి సహకారంతో ముందుకు వెళ్ళాలని చర్చించారు. అదేవిధంగా కల సాకారం కోసం కల్వరాల గ్రామంలో గ్రామ పంచాయితి వారు ఇచ్చిన స్థలంలో గోదాము నిర్మాణానికి, కార్యాలయం, రైతు సేవా కేంద్రం ఏర్పాటు చేయటానికి తీర్మానం చేసుకున్నారు. వాటా ధనం చెల్లించిన సభ్యులందరికి వడ్డీని లెక్కించి ఇవ్వటానికి మహాసభలో తీర్మానించారు.

రాబోవు సంవత్సరంలో వ్యాపారం, లావాదేవీలు జరిపిన సభ్యులకు బోనస్ ఇవ్వాలని తీర్మానించారు. ముఖ్యంగా ఒక పద్ధతి ప్రకారం ఉప విధులకు అవసరమైన సవరణలు చేస్తూ తీర్మానం చేసుకున్నారు. సమావేశం అనంతరం ఈ సవరణలను, తీర్మానాలను గురించి జిల్లా



సహకార అధికారికి రిటర్న్ దాఖలు చేశారు.

**రైతు సంఘాల ఆడిట్**

ధరణి ఎఫ్.పి.ఓ వార్షిక మహాసభ నిర్వహణ కంటే ముందు స్వయం నియంత్రణ ఉద్యమ కార్యక్రమాలలో భాగంగా ఎఫ్.పి.ఓ పరిధిలోని పది గ్రామాలలో వారు ఏర్పాటు చేసుకున్న రైతు సంఘాలను ఆడిట్ చేసుకున్నారు. రైతు సంఘాలలో ఎన్నికలు నిర్వహించి లీడర్ల మార్పిడి చేశారు. మరియు గ్రామ రైతు సంఘాల ఆడిట్, ఎన్నికలు గ్రామ రైతు సంఘాల మహాసభలు నిర్వహించారు.


ముఖ్యంగా ఎఫ్.పి.ఓ వార్షిక మహాసభ సజావుగా జరపటం కోసం బోర్డు సభ్యులు నిర్వహణ కమిటీలను ఏర్పాటు చేసుకుని బోర్డు, కమిటి సభ్యులే పూర్తి బాధ్యత తీసుకొని మహాసభను విజయవంతంగా నిర్వహించటంలో ప్రధాన పాత్ర పోషించారు. సంఘాల, సంస్థల బలోపేతం కోసం స్వయం నియంత్రణ ఉద్యమ నినాదాలైన 'సంఘాలు మనవే, సమాఖ్యలు మనవే. పాలనా మాదే, నియంత్రణ మాదే' స్ఫూర్తితో ఎంతో చక్కగా నిర్వహించారు.

ఈ మహాసభ కార్యక్రమానికి కామారెడ్డి జిల్లా వ్యవసాయ అధికారిణి శ్రీమతి భాగ్యలక్ష్మి , జిల్లా సహకార అధికారిణి శ్రీమతి వసంత , మండల వ్యవసాయ అధికారి శ్రీ ప్రజాపతి, వ్యవసాయ విస్తరణ అధికారిణి శ్రీమతి శ్రీలక్ష్మి హాజరై ఇంత చక్కగా మహాసభ నిర్వహణ చూడటం ఇదే మొదటిసారి అని శుభాకాంక్షలు తెలుపుతూ ప్రభుత్వం తరపున వారి పరిధిలో సహాయ సహకారాలు అందిస్తామన్నారు.

ఏపిమాస్ ప్రధాన కార్యాలయం నుండి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీ మధుమూర్తి , ప్రాజెక్ట్ మేనేజర్లు శ్రీ కిశోర్ కుమార్, శ్రీ శ్రీనివాస్, పాల్గొని ధరణి ఎఫ్.పి.ఓ మహాసభను బోర్డు సభ్యులే స్వయంగా, ఇంత చక్కగా నిర్వహించుకున్నందుకు వారిని అభినందించారు. సమాఖ్య ఏదైతే వార్షిక ప్రణాళిక చేసుకోన్నదో ఆ ప్రణాళికను ఎప్పటికప్పుడు సమీక్షించు కుంటూ ముందుకు సాగాలని సూచించారు. వ్యాపారపరమైన కార్యక్రమాలు చేస్తూ సభ్యులందరికి సేవలు అందించాలనని, ఎఫ్.డి.సి, రైతు సేవా కేంద్రంలో సభ్యులందరూ సేవలు వినియోగించుకోవాలని సూచించారు. ఏపిమాస్ సంస్థ ద్వారా ఇంకా కావాల్సిన తోడ్పాటు అందిస్తామని చెప్పారు.

కుమారి అమృత రాణి మాట్లాడుతూ వ్యవసాయానికి సంబంధించిన సాంకేతికపరమైన సేవలు అందరు వినియోగించుకొని దిగుబడిని పెంచాలని, సమావేశాలు జరుపుకుంటూ, సక్రమంగా పుస్తక నిర్వహణ సాగించాలని, నూతన సభ్యులను ఎఫ్.పి.ఓ లో చేర్చుకొని , ఉన్న సభ్యులు మరింత వాటాధనం చెల్లించి, సంస్థ స్వంత నిధులను పెంచి కొత్త వ్యాపారాలు చేపట్టాలని సూచించారు.

జనగాం జిల్లాలో ఏపిమాస్ , మారి స్వచ్ఛంద సంస్థలు కలిసి ఏర్పాటు చేసిన 'రైతు వికాస సమాఖ్య' పాలక వర్గ సభ్యులు, సి.ఇ.ఓ లు ఈ మహా సభలో పాల్గొని సంతోషం వ్యక్తం చేశారు.



ధరణి ఎఫ్.పి.ఓ మాదిరిగా వారి యఫ్.పి.ఓ లలో కూడా వార్షిక మహాసభలు నిర్వహించటానికి ప్రణాళికలు చేసుకుంటామని తెలిపారు. చివరగా ఎఫ్.పి.ఓ కార్యదర్శి వందన సమర్పణతో సమావేశం ముగిసింది. ■

పరస్పరం ఎంత గౌరవం వుందనేది కాదు, ఆ గౌరవం ఎంతకాలం వుంటుందనేది ముఖ్యం

# తెలంగాణా 'సెర్ప్' కు ఎఫ్ పి ఓలపై జాతీయ అవార్డు !

తెలంగాణకు మరో జాతీయ స్థాయి అవార్డు లభించింది. రైతు ఉత్పత్తిదారుల సంస్థల (ఎఫ్‌పిఓల) ఏర్పాటులో దేశంలోనే తెలంగాణ అగ్రస్థానంలో నిలిచింది. ఇందుకుగాను కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్)కు జాతీయ స్థాయి ఉత్తమ అవార్డును ప్రకటించింది. ఇటీవల ఢిల్లీలో నిర్వహించిన ఒక కార్యక్రమంలో కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ నుంచి తెలంగాణ సెర్ప్ సి ఓ ఓ ఎన్ రజిత ఈ అవార్డును అందుకొన్నారు. ఈ సందర్భంగా జాతీయ గ్రామీణ జీవనోపాధుల మిషన్ (ఎన్ఆర్ఎల్ఎం) అదనపు కార్యదర్శి చరణ్‌జిత్‌సింగ్.. తెలంగాణ సెర్ప్ సి ఇ ఓ) సందీప్‌కుమార్ సుల్తానియాను అభినందించారు.

ఆత్మనిర్భర్ ప్రాజెక్టులో భాగంగా చేపట్టిన 10,000 రైతు ఉత్పత్తిదారుల సంస్థల పథకంలో తెలంగాణ సెర్ప్ ఆధ్వర్యంలో 35 రైతు ఉత్పత్తిదారుల సమాఖ్యలను కంపెనీల చట్టం ప్రకారం రిజిస్టర్ చేశారు. ఇందులో సభ్యులుగా ఉన్న 23,469 మంది మహిళా రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను దళారుల ప్రమేయం లేకుండా నేరుగా కంపెనీలకు విక్రయిస్తూ లాభాలు ఆర్జిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం పంటల అమ్మకాల్లో దళారుల ప్రమేయాన్ని నివారించేందుకు ఎఫ్‌పిఓల ఏర్పాటును ప్రోత్సహిస్తున్నది. సెర్ప్ ద్వారా సన్న, చిన్నకారు రైతులకు తక్కువ ధరకు వ్యవసాయ పరికరాలు, యంత్రాలను అందుబాటులో ఉంచింది. ■

# 'భూసంపద' ఎఫ్ పి సి మొదటి వార్షిక సమావేశం



తెలంగాణ రాష్ట్రం, ఆదిలాబాద్ జిల్లా, నార్నూర్ మండలంలో ఏపిమాస్ ప్రోత్సాహంతో ఏర్పాటైన "భూ సంపద ఎఫ్ పి సి (ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్)" ఏపిమాస్, నాబార్డు మద్ధతుతో మొదటి వార్షిక మహాసభ సమావేశాన్ని గుండాల గ్రామంలో నిర్వహించింది.

ఎఫ్‌పిఓ పరిధిలోని 10 వేర్వేరు గ్రామాల నుండి 100 మంది వాటాదారులు దీనికి హాజరయ్యారు. వార్షిక నివేదికతో పాటు ఆడిట్ చేయబడిన ఆర్థిక నివేదికను మహాసభకు ఛైర్ పర్సన్, సిఈఓ సమర్పించారు. పాలకవర్గ సభ్యులు వచ్చే ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్‌తో పాటు వార్షిక కార్యాచరణ ప్రణాళికను సమర్పించారు. ఐదుగురు పాలకవర్గ సభ్యులు పదవీ విరమణ చేయగా, వివిధ గ్రామాల నుండి కొత్తగా ఐదుగురు పాలకవర్గ సభ్యులను ఎన్ను కున్నారు (వీరిలో ముగ్గురు మహిళలు). మహిళా వాటాదారులను ముందయగా 33%కి (ప్రస్తుతం ఇది 26%), రాబోయే రెండు సంవత్సరాల్లో 50%కి పెంచడంపై సంక్షిప్త చర్చ జరిగింది.

వర్మీ కంపోస్టింగ్, ఆర్గానిక్ పెస్టిసైడ్స్, పత్తిని ప్రాసెసింగ్ చేయడం, కందుల ప్రాసెసింగ్, 2 ఎకరాల భూమి కొనుగోలు / లీజు, నాబార్డ్ వారి ద్వారా టీడీఎఫ్ కొరకు దరఖాస్తు వంటి ప్రధానాంశాలతో వ్యాపార ప్రణాళికను ప్రతిపాదించి, ఆమోదించారు. ఈ సమావేశానికి జడ్పీ ఛైర్ పర్సన్ శ్రీ జనార్దన్ రాథోడ్, ఐటీడీఏ ఉట్నూర్ ఛైర్ పర్సన్ శ్రీ లఖీరావు, ఎంపీపీ ఛైర్ పర్సన్ శ్రీ ప్రభాకర్, ఏపిమాస్ ప్రతినిధి శ్రీ మురళీ జజూనా తదితరులు హాజరయ్యారు. ■

ఆరోగ్యానికి మూలం ఔషధం కాదు ;ఆలోచనలో,ఆచరణలో ప్రశాంతత,నవ్వు,ప్రేమ ... ఇవే ఆరోగ్యం

# మహిళా రైతులు పంటలను బ్రాండ్‌లా తేవాలి



మహిళలు పండించిన తమ పంటలను ఒక బ్రాండ్‌గా మార్చుకుని మార్కెట్లోకి తీసుకు రావాలని, తద్వారా అధిక లాభాలు పొందాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మహిళా రైతులకు సూచించారు.

మండలంలోని చీకటిమామిడి గ్రామంలో గల రైతు వేదికలో శుక్రవారం సోలిపేట గ్రామీణ మహిళా మండలి నిర్వహించిన దిశాలి రైతు మహిళా ఉత్పత్తిదారుల కంపెనీ ఐదవ వార్షికోత్సవ సర్వసభ్య సమావేశానికి ముఖ్య అతిథిగా కలెక్టర్ పమేలా సత్పతి హాజరయ్యారు.

ఈ సందర్భంగా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ దిశాలి రైతులు పండిస్తున్న పంటలను ఒక బ్రాండ్‌గా చేసుకొని మార్కెట్లో తీసుకొచ్చి అధిక లాభాలు పొందాలని, అభివృద్ధితో పాటు దిశాలి కంపెనీని కూడా లాభాల్లోకి తీసుకురావాలని అన్నారు.

మహిళలు వ్యాపారవేత్తలుగా - వ్యవసాయాన్ని వ్యాపారంగా చేస్తే లాభాలు గడిస్తారని, తద్వారా తమ కుటుంబాన్ని అభివృద్ధి పరచుకోవాలని సూచించారు.

ఒకే వేదిక మీద ఇంతమంది మహిళా రైతులను చూసినందుకు సంతోషంగా ఉందని కలెక్టర్ చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఈఐఎన్ కన్సల్టెంట్ కమలమణి, నాబార్డ్ డీడీఎం వినయ్‌కుమార్, డీఏఓ అనురాధ, ఎంపీడీవో సరిత, ఏపిమాస్ ప్రతినిధులు, మహిళా మండలి అధ్యక్షురాలు విజయలక్ష్మి, నిమ్మయ్య, ఏవో పద్మప్రియ, హరిలాల్ రైతులు తదితరులు పాల్గొన్నారు. ■




ఇతరులను లెక్కచేయని పొగరుబోతుగా మార్చే విజయం కంటె, వినయాన్ని నేర్పే ఓటమి మేలు

# నీళ్ళు తక్కువ తాగినా, ఎక్కువ తాగినా సమస్యే !

ఆహారం లేకపోయినా కొంతకాలం జీవించవచ్చుకాని, నీళ్ళు లేకపోతే మాత్రం ఎక్కువ కాలం జీవించలేము. మన జీవితంలో నీళ్ళ ప్రాధాన్యం ఏమిటో దీనిని బట్టి అర్థమవుతున్నది కదా! అందువల్లనే మన రోజువారీ శరీర పోషణలో మంచినీళ్ళు ఎక్కువగా తాగమని చెబుతారు. అది నిజమే. ఐతే, 'అతి సర్వత్ర వర్జ్యయేత్ ' (ఏ విషయంలో కూడా అతి పనికిరాదు) అనే విషయం కూడా గుర్తుంచుకోవాలని పోషకాహార నిపుణులు సూచిస్తున్నారు. అందువల్ల రోజూ ఎన్ని నీళ్ళు తాగాలో, ఎంతకు మించి తాగకూడదో తెలుసుకుందాం.

**నీళ్ళు సరిగ్గా తాగకపోతే ...**

మీరు మంచి నీళ్ల రోజుకు ఎన్నిసార్లు తాగుతారంటే... దాహం వేసినప్పుడు తాగుతా అంటారు.

కాని నిజానికి రోజూ ఏసీ గదుల్లో ఉంటూ ఎంతమంది నీళ్ల తాగుతున్నారు ? కొందరు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఒక లీటర్ నీళ్ళు కూడా తాగరు.

మన శరీరానికి నీళ్ళు తాగడం చాలా అవసరం. ఎందుకంటే.. మనుషుల శరీరం మూడోవంతు నీటితోనే నిర్మాణమై ఉంటుంది. కాబట్టి నీళ్ళు సరిగా అందకపోతే.. శరీరంలో అనేక సమస్యలు ఎదురవుతాయి.

1. మీరు కూర్చుని లేవలేకపోతున్నారా... కీళ్ళు, కండరాలు నొప్పులతో అవస్థ పడుతున్నారా...అయితే మీరు తక్కువ నీళ్ళు తాగుతున్నారన్నమాట. ఎందుకంటే.. కీళ్ళ మధ్యలో ఉండే కార్టిలేజ్ 80 శాతం నీటితో నిర్మితమై ఉంటుంది. మీరు నీళ్ళు తక్కువగా తాగినప్పుడు ఈ నొప్పులు వస్తాయి..
2. తలనొప్పి తరచుగా వస్తుందా... నీళ్ళు తక్కువగా తాగినప్పుడు మిమ్ములను తలనొప్పి వేధిస్తుంటుంది. ఆక్సిజన్ తక్కువగా అందడం, బ్రెయిన్‌కి రక్తం తక్కువ అందడం వంటివి శరీరానికి నీరు తక్కువ కావడం (డీహైడ్రేషన్) వల్ల కలుగుతాయి. దీంతో తలనొప్పి వస్తుంది.
3. జీర్ణవ్యవస్థకు కూడా నీళ్ళు చాలా అవసరం. డీహైడ్రేషన్ కారణంగా, ఫ్లూయిడ్స్ తక్కువగా అందడం వల్ల ఈ సమస్య కనిపిస్తుంది.
4. అలసట, ఎనర్జిటిక్‌గా, యాక్టివ్‌గా లేకపోవటం అనేవి కూడా తక్కువ నీరుకు సంబంధించినవే. బ్లడ్‌ప్రెజర్ తగ్గిపోతుంది. దీనివల్ల ఆక్సిజన్ సరిగా అందదు. ఇలాంటి లక్షణాలు కనిపించాయి అంటే.. మీరు కావాల్సిన మోతాదులో నీళ్ళు తాగడం లేదని అర్థం.
5. యూరిన్ కలర్ మీ శరీరం డీహైడ్రేట్ అయిందని తెలిపే ముఖ్య లక్షణం. తరచుగా యూరిన్‌కి వెళ్లకపోయినా.. మీరు సరైన స్థాయిలో నీళ్ళు తాగడం లేదని గుర్తించాలి. రోజుకు 4 నుంచి 7 సార్లు యూరిన్‌కి వెళ్ళాలి. మీ యూరిన్ ఎల్లో కలర్‌లో ఉంది అంటే కూడా మీరు నీళ్ళు చాలినంత తాగడం లేదని గుర్తించాలి.
6. బ్రెయిన్ ఫంక్షన్ పైనా ఇది ప్రభావం చూపుతుంది. మీ మూడ్, మెమరీ, డెసిషన్, ఏకాగ్రత వంటివాటిపై కూడా ఇది ప్రభావం చూపుతుంది.
7. పెదాలు ఆరిపోవడం, చర్మం ప్రకాశవంతంగా ఉండక పోవటం, పొడిబారిపోవటం. చెమట చాలా తక్కువగా పట్టడం..యివన్నీ మీరు సరిగ్గా నీళ్ళు తాగటం లేదని చెప్పే సంకేతాలు... ఇకనైనా తగినంతగా నీళ్ళుతాగడం అలవాటు చేసుకోండి. ఇకపై ఈ సూచనలు కనిపించిన వెంటనే నీళ్ళుతాగటం ఎక్కువ చేసుకోండి.

**నీళ్ళు మరీ ఎక్కువగా తాగితే ...**

సమయానికి నీళ్ళు తాగితే 60 శాతం జబ్బులను తగ్గించుకోవచ్చు. అలాఅని అదే పనిగా నీటిని త్రాగితే చాలా అనర్థాలున్నాయి. అవేంటో తెలుసుకుందాం.

- నీటిని తక్కువ తీసుకుంటే డీహైడ్రేషన్.. ఎక్కువగా తీసుకుంటే ఓవర్ హైడ్రేషన్ వల్ల తలనొప్పి వస్తుంది.

*(మిగతా 34వ పేజీలో ...)*

# వరికి చీడపీడలు ఆశించే తరుణం ... బహు పరాక్!

– శ్రీను

రెండు తెలుగు రాష్ట్రాలలోని రైతులు ఈ నెలలో చేయవలసిన వ్యవసాయ పనులలో వరిలో చీడపీడలు అశించకుండా జాగ్రత్త వహించడం, ఆశిస్తే తగిన విరుగుడు చర్యలు వెంటనే చేపట్టడం ఎంతైనా ముఖ్యం. మొక్కజొన్న, వేరుశనగ పంటలను కోసి, మరో పంట వేసుకునే తరుణం కూడా యిదే. పత్తిలో కూడా చీడపీడల నివారణ చర్యలు అవసరం. వీటితోపాటు టమాట, మామిడి, బత్తాయి, నిమ్మ తోటలలో చేపట్టవలసిన వ్యవసాయ పనుల గురించి వివరంగా తెలుసుకుందాం.

**వరి**

రెండు తెలుగు రాష్ట్రాలలోని వివిధ జిల్లాల్లో వరి పంట ఎక్కువ శాతం చిరుపొట్ట దశ నుండి గింజ పాలు పోసుకొనే దశలో ఉన్నది. వానాకాలంలో అక్టోబర్ నెల అత్యంత కీలకం. ముఖ్యంగా ఈ నెలలో చీడపీడల, తెగుళ్ళ ఉధృతి అధికంగా ఉంటుంది. చిరుపొట్ట దశలో ఉన్న వరి పొలాలకు ఆఖరి దఫా ఎరువులను (30–35 కిలోల యూరియా , 15 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్) వేయాలి.

గత సంవత్సరం అనుభవాలు, అక్టోబర్ నెలలో ఉండే వాతావరణ పరిస్థితుల్లో వరి పంటలో సుడిదోమ, కాండం తొలిచే పురుగు, ఆకు ముడత, ఆకు/కంకి నల్లి, పాముపొడ, బ్యాక్టీరియా ఎండాకు తెగులు, అగ్గితెగులు, పొట్టకుళ్ళు, గింజమచ్చ తెగులు, మాను పండు తెగులు ప్రధాన సమస్యలుగా ఉండే అవకాశం ఉంది. కావున వరి పైర్లలో చీడపీడలు గమనించిన వెంటనే ఈ క్రింది నివారణ చర్యలు చేపట్టాలి.

**సుడిదోమ, కాండం తొలిచే పురుగు,**

**ఆకుముడత, ఆకు/కంకి నల్లి, పాముపొడ:**

పైన తెలిపిన చీడపీడలను క్రింద తెలిపిన రసాయన ఎరువులను, పురుగు మందులను వాడి నివారణ చర్యలు చేపట్టాలి. అధిక యూరియ ఎరువులు, నీటి తడులు ఎక్కువగా యిస్తే చీడపీడల బెడద అధికం అయ్యే అవకాశం ఉంది. పురుగు నివారణకు కార్టాప్ హైడ్రోక్లోరైడ్, ఫ్లూబెండమైడ్, క్లోరాంట్రానిలిప్రోల్ వంటి మందులను వాడాలి. ఈ పురుగును పిల్ల దశలో (తెల్లని దోమలు మొక్కల మొదళ్ళ వద్ద) గమనిస్తే బుప్రోఫెజిన్ 1.6 మి.లీ. లేదా ఎసిఫేట్ + ఇమిడాక్లోప్రిడ్ మిశ్రమ మందు 1.5 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

పిల్ల, పెద్ద పురుగులు కలిసి ఉన్న దశలో డైనోఫ్యూరాన్ 0.4 గ్రా. లేదా పైమెట్రోజైన్ 0.6 గ్రా. లేదా టైపు మోజో పైరిమ్ 0.48 మి.లీ. లేదా ఎథిప్రోల్ ఇమిడాక్లోప్రిడ్ 0.25 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. నీళ్ళు తగ్గించి, పాయలు తీసి మొక్కల మొదళ్ళకు గాలి తగిలేలా చేస్తే దోమ బాగా తగ్గుతుంది.

**బ్యాక్టీరియా ఎండాకు తెగులు**

ఈ తెగులు లక్షణాలు గమనించిన వెంటనే నత్రజని ఎరువును వేయటం తాత్కాలికంగా నిలిపివేయాలి. తొలిదశలో వ్యాప్తిని నివారించడానికి వరిపైరు చిరు పొట్ట దశలో మాత్రమే కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రా. + ప్లాంటామైసిన్ గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

**మానిపండు / కాటుక తెగులు**

ఈ తెగులు వరి పంట పూత దశలో ఉన్నప్పుడు, వర్షాలు పడినప్పుడు అధికంగా ఆశించే అవకాశం ఉంటుంది. రైతులు పూత దశలో తెగుళ్ళ మందులు పిచికారి చేయాలి. గింజ గట్టి పడే దశలో తెగుళ్ళ మందులు పిచికారి చేసినా ప్రయోజనం ఉండదు.

వరి పైరు ఈనె దశలో ఒకసారి (10–15% పూతదశ), ఆ తర్వాత 7–10 రోజుల వ్యవధిలో రెండవసారి కార్బండాజిమ్ 1 గ్రా. లేదా ప్రాపికొనజోల్ 1 మి.లీ. లేదా

బెబ్యుకొనజోల్ ట్రైపాక్సిస్ట్రోబిన్ 0.4 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

**మొక్కజొన్న:**

మొక్కజొన్నలో గింజపాలు పోసుకునే దశ, గింజ గట్టిపడే దశలు చాలా సున్నితమైనవి. కావున పంట బెట్టకు గురి కాకుండా నీటిని అందజేయాలి. పక్వానికి వచ్చిన పైరులోని కండెల పైపొర ఎండిపోయి, గింజల తెదుగు భాగంలో నల్లటి మచ్చ ఏర్పడినప్పుడు కోత చేపట్టాలి. కండెలను ఎండబెట్టి తేమ 15 శాతంకు తగ్గిన తర్వాత నూర్పిడి చేయాలి.

నూర్పిడి అయిన గింజలను 10-12 తేమ శాతం వచ్చే వరకు ఆరబెట్టి నిల్వ చేయాలి. యాసంగిలో మొక్కజొన్న విత్తుకోవడానికి అక్టోబరు 15 నుండి నవంబరు 15 వరకు సరియైన సమయం. ఈ సమయంలో విత్తుకున్నట్లయితే పంట దిగుబడులు అధికంగా పొందడానికి అవకాశముంది.

**వేరుశనగ**

వానాకాలంలో విత్తుకున్న పంట కోతకు సిద్ధంగా ఉంది. 75 శాతం కాయలు పూర్తిగా పక్వానికి వచ్చినప్పుడు కోయాలి. కూలీల కొరత అధికంగా ఉండే ఈ సమయంలో మొక్కనుండి కాయలను వేరు చేయడానికి ట్రెషర్లను ఉపయోగించాలి. ఒకగంటలో 2-2.5 క్వింటాళ్ళ కాయలను మొక్కనుండి వేరుచేయవచ్చు.

వేరుశనగను యాసంగిలో అక్టోబర్ నుండి నవంబరు రెండవ పక్షం వరకు విత్తుకోవచ్చు. 65-80 కిలోల విత్తనాలు ఒక ఎకరా పొలం సాగుకు అవసరం అవుతాయి. యాసంగిలో ఈ పంటను పండించేటప్పుడు ఒక చదరపు మీటరుకు 44 మొక్కలు ఉండే విధంగా వరుసకు వరుసకు మధ్య 22.5 సెం.మీ, మొక్కకు మొక్కకు మధ్య 10 సెం.మీ. దూరం ఉండేలా విత్తుకోవాలి.

**ప్రత్తి**

గత మాసంలో కురిసిన అధిక వర్షాలకు ప్రత్తి పంటలో నీరు ఆగిపోవటం, పూత రాలటం, కొన్ని ప్రాంతాల్లో ప్రత్తి పెరుగుదల సరిగా లేకపోవటం, మరికొన్ని చోట్ల బాగా పెరగడం, పంటలో తామర పురుగు, పచ్చదోమ, ఆకు మచ్చలు, వడలు తెగుళ్ళు మొదలగునవి కనిపిస్తున్నాయి. కావున ఈ క్రింది చర్యలను అవసరాన్ని బట్టి చేపట్టాలి.

బాగా పెరిగిన ప్రత్తికి భూమి ద్వారా ఎరువులు వేయడం ఆపాలి. కాని కాత పట్టిన తర్వాత కాయ ఎదిగే సమయంలో పైపాటుగా పంటలపై నీటిలో కరిగే పోషకాలను 10-15 రోజుల వ్యవధిలో 2 లేదా 3 సార్లు పిచికారి చేయాలి. లీటరు నీటికి 10 గ్రా. పాలీఫిడ్ (19:19:19) లేదా మల్టీ-కె (13-0-45) లేదా యూరియా లాంటివి కలిపి పిచికారి చేసుకోవచ్చు.

అధిక తేమ వలన పంటలో అక్కడక్కడ మొక్కలు వడలిపోవడం, ఎండిపోవడం గమనించిన వెంటనే లీటరు నీటికి 2 గ్రా. కార్బండాజిమ్ + మ్యాంకోజెబ్ మిశ్రమం + 0.1 గ్రా. ప్లాంటామైసిన్ లేదా 3 గ్రా. కాపర్ ఆక్సీక్లోరైడ్ + 0.1 గ్రా. ప్లాంటామైసిన్ కలిపి తెగుళ్ళు ఆశించిన మొక్కల చుట్టూ భూమిని తడపాలి.

పచ్చదోమ, తామర పురుగు నివారణకు లీటరు నీటికి 0.3 గ్రా. ఫ్లోనికామిడ్ లేదా 0.25 మి.లీ. ఇమిడాక్లోప్రిడ్ లేదా డైనోటెఫ్యురాన్ 0.3 గ్రా. లేదా స్పైనటోరమ్ 0.9 గ్రా. లేదా 1.25 గ్రా. డైఫెన్ థయూరాన్ లేదా 2 మి.లీ. ఫిప్రోనిల్ లాంటి మందులను మారుస్తూ పిచికారి చేయాలి. చివరి రెండు మందులు తెల్లదోమ నివారణకు కూడా పని చేస్తాయి.

పొగాకు లద్దె పురుగు ఆశించిన చోట లీటరు నీటికి 1.5 గ్రా. థయోడికార్బ్ లేదా 1 మి.లీ. నొవాల్యురాన్ లేదా 0.3 మి.లీ. క్లోరాంట్రానిలిప్రోల్ లేదా 0.5గ్రా. ఇమామెక్టిన్ బెంజోయేట్ మందులను పిచికారి చేసి నివారించుకోవాలి.

**మామిడి:**

పొలాన్ని దున్నటం, ఎరువులు వేయడం, నీరు పెట్టడం చేయకూడదు. తేనె మంచు పురుగు, పిండినల్లి, పొలుసు పురుగు అధికంగా ఆశించిన తోటల్లో వేప నూనె 3 మి.లీ. లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి. ఈ మందులను కేవలం కాండం, ప్రాథమిక కొమ్మలు తడిసేలా పిచికారి

(మిగతా 30 వ పేజీలో ...)

# రైతులకు కాసులు కురిపించే కడక్‌నాథ్ కోళ్ళు!

**ఈ** మధ్య కడక్‌నాథ్ కోళ్లు మార్కెట్లో సందడి చేస్తున్నాయి. ఇవి నలుపు రంగులో ఉంటాయి. రక్త మాంసాలు కూడా నల్లగానే ఉంటాయి. కడక్‌నాథ్ కోళ్ళ మాంసంలో అనేక ఔషధ గుణాలున్నాయి. ఇందులో ఐరన్, ప్రొటీన్లు ఎక్కువగా ఉంటాయి. కొలెస్టరాల్ తక్కువగా ఉంటుంది. కడక్‌నాథ్ కోళ్ళ మాంసం హార్ట్, షుగర్ పేషెంట్లకు ఎంతో మేలు చేస్తుంది. దీనిని రెగ్యులర్‌గా వినియోగిస్తే శరీరానికి చాలా పోషకాలు అందుతాయి. అందువల్లే కడక్‌నాథ్ మాంసానికి మార్కెట్లో అధిక డిమాండ్ ఉంది. రేటు కూడా బాగా లభిస్తోంది.



మన దేశంలో మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో కడక్‌నాథ్ కోళ్ల పెంపకం ఎక్కువగా జరుగుతోంది. ఈ రాష్ట్రాల్లోని గిరిజన ప్రాంతాల ప్రజలు కడక్‌నాథ్ కోళ్లను కాలీమాసీ అని పిలుస్తారు.

ఈ రెండు రాష్ట్రాల్లోని కృషి విజ్ఞాన కేంద్రాలు కడక్‌నాథ్ కోడి పిల్లలను సకాలంలో అందించలేకపోతున్నాయంటే.. అక్కడ ఏ స్థాయిలో దీని వ్యాపారం ఉందో.. ఎంత డిమాండ్ ఉందో అర్థం చేసుకోవచ్చు. భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీ కూడా కడక్‌నాథ్ కోళ్లను పెంచుతున్నారు. ఆయన కూడా మధ్యప్రదేశ్ నుంచే కోడి పిల్లలను కొనుగోలు చేసి.. తమ కోళ్ల ఫారమ్‌లో పెంచుతున్నారు. మధ్యప్రదేశ్‌లోని ఝబువా జిల్లాలో కడక్‌నాథ్ కోళ్లు పుట్టినందున.. జిఐ ట్యాగ్ కూడా వచ్చింది.

మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వాలు దానిని ప్రోత్సహించడానికి అనేక పథకాలను అమలు చేస్తున్నాయి. ఛత్తీస్‌గఢ్‌లో కేవలం రూ. 53,000 రూపాయలతోనే కడక్‌నాథ్ కోళ్ల వ్యాపారం ప్రారంభించవచ్చు. ఈ డబ్బును డిపాజిట్ చేస్తే... ప్రభుత్వమే 1000 కోడిపిల్లలు, 30 కోళ్ల జాలీ, 6 నెలల పాటు ఉచిత దాణాను మూడు విడతలుగా ఇస్తుంది. టీకా, ఆరోగ్య సంరక్షణ బాధ్యతను కూడా ప్రభుత్వం భరిస్తుంది. అంతేకాదు కోళ్లు పెద్దయ్యాక మార్కెటింగ్ పరంగానూ ప్రభుత్వం సాయం చేస్తుంది.

మీరు కూడా కడక్‌నాథ్ కోళ్ల పెంపకం వ్యాపారం చేయాలనుకుంటే కృషి విజ్ఞాన కేంద్రం నుండి కోడిపిల్లలను తీసుకోవచ్చు. ఒక్క కడక్‌నాథ్ కోడిపిల్ల ధర ధర రూ.70–100 మధ్య ఉంటుంది. గుడ్డు ధర రూ.20–30కి లభిస్తుంది. ఛత్తీస్‌గఢ్‌లో అక్కడి ప్రభుత్వ సబ్సిడీ ఇస్తున్నందున అక్కడి ప్రజలకు పెట్టుబడి తక్కువే అవుతుంది.

కానీ ఏపీ, తెలంగాణలో అలాంటి పథకాలు లేవు. మనమే సొంత డబ్బులతో కోడి పిల్లలను కొనుగోలు చేసి.. వాటిని పెంచాల్సి ఉంటుంది. మీరు 1000 కోడి పిల్లలను రూ.70 చొప్పున కొంటే.. రూ.70 వేల ఖర్చవుతుంది. షెడ్ నిర్మించుకుంటే ఎక్కువ ఖర్చవుతుంది. అందువల్ల ప్రారంభంలో... కేజ్‌లల్లో పెంచవచ్చు. దాణా, ఇతర ఖర్చులు కలుపుకుంటే.. మీకు మరో 3 లక్షల వరకు ఖర్చవుతుంది. మొత్తంగా వెయ్యి కోడి పిల్లలతో కడక్‌నాథ్ కోళ్ల వ్యాపారం చేస్తే... మీకు రూ.4 లక్షల వరకు ఖర్చు వస్తుంది. కాస్త



శ్రద్ధ పెట్టి.. అన్ని జాగ్రత్తలు తీసుకుంటూ.. కోడిపిల్ల లను పెంచితే... అవి మూడు నాలుగు నెలల్లో అమ్మకానికి వస్తాయి.

మీరు తీసుకున్న వెయ్యి కోడి పిల్లల్లో మోర్టా లిటీ పోను.. రూ.900 వరకు ఉందాయును కుందాం. అవి ఒక్కొక్కటి రెండు కిలోల చొప్పున పెరిగితే.. మొత్తం 1800 కేజీలు. మార్కెట్లో కిలో కడక్‌నాథ్ మాంసం 1000-1200 వరకు ఉంటుంది.

అదే లైవ్ కోడి అయితే... రూ.800 వరకు పలుకు తుంది. కానీ మీరు సొంతంగా మార్కెంటింగ్ చేసు కోలేకపోతే.. ఏదైనా కంపెనీకి విక్రయించవచ్చు. కిలోకు రూ.500 చొప్పున అన్ని కోళ్లను ఒకేసారి విక్రయించవచ్చు. ఈ లెక్కన 1800 కేజీలకు.. రూ.9 లక్షల ఆదాయం వస్తుంది. ఇందులో ఖర్చులు పోతే.. రూ.5 లక్షలు మిగులుతాయి. అంటే మూడు నాలుగు నెలల్లోనే ఇంత ఆదాయం వస్తుందన్నమాట. మీరు షెడ్ వేసి.. ఇంకా ఎక్కువ పిల్లలను పెంచితే.. ఆదాయం భారీగా పెరుగుతుంది.

(ఈ కథనం కేవలం ఇంటర్నెట్‌లో అందుబాటులో ఉన్న సమాచారం ఆధారంగా మాత్రమే ఇవ్వబడింది.

ఈ వ్యాపారం ప్రారంభించే ముందు లోతైన అధ్యయనం చేయడం, సంబంధిత మార్కెట్ నిపుణుడిని సంప్రదించడం శ్రేయస్కరం) ■

# జాతీయస్థాయిలో సహకార విశ్వవిద్యాలయం

**దే**శంలో ప్రస్తుతం 65 వేల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు (ప్యాక్స్) క్రియాశీలంగా పని చేస్తున్నాయని, వచ్చే అయిదేళ్లలో 3 లక్షల కొత్త సంఘాలు ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని కేంద్ర సహకార శాఖ మంత్రి అమిత్ షా తెలిపారు. ఇటీవల జరిగిన రాష్ట్ర సహకారశాఖ మంత్రుల రెండు రోజుల సదస్సును ఉద్దేశించి ఆయన ప్రారంభోపన్యాసం చేశారు. భవిష్యత్తులో విస్తరించే సహకార రంగానికి అవసరమైన మానవ వనరుల తయారీ కోసం జాతీయస్థాయిలో సహకార విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు.

ప్రతి రాష్ట్రంలో దీని అనుబంధ కళాశాలలు ఏర్పాటు చేసి డిప్లొమా, డిగ్రీ కోర్సులు నిర్వహిస్తామన్నారు. సహకార వ్యవస్థలను ఇప్పటివరకూ రెండో తరగతి పౌరుల్లా చూస్తూ వచ్చారని, ఇకముందు అలాంటి పరిస్థితి ఉండదన్నారు. నాలుగైదు పెద్ద సహకార సంఘాలను ఏకంచేసి జాతీయస్థాయిలో బహుళ రాష్ట్ర విత్తనోత్పత్తి సహకారసంఘాన్ని ఏర్పాటు చేస్తామని చెప్పారు. అది విత్తనాలపై పరిశోధనలు చేసి కొత్త వంగడాలను రూపొందిస్తుందన్నారు. ఆర్గానిక్ ఉత్పత్తులు పండిస్తున్నా ఇప్పటివరకు వాటిని ధ్రువీకరించే వ్యవస్థ లేదని, ఈ లోటును భర్తీ చేయడానికి 'అమూల్' నేతృత్వంలో ధ్రువీకరణ పత్రం జారీ చేసి, మార్కెటింగ్ చేపట్టే అంతర్రాష్ట్ర సహకార వ్యవస్థను ఏర్పాటు చేయనున్నారు. ■

# బత్తాయిలో ఆశించే తెగుళ్ళు - యాజమాన్యం

– చంగా(లెడ్డి అనుష

**భా**రతదేశంలో సుమారు 1.91 లక్షల హెక్టార్లలో బత్తాయి సాగవుతుంది. తెలంగాణలో బత్తాయి తోటలు ప్రధానంగా పుర్వ్యవస్థీకరణకు పూర్వపు నల్గొండ, మహబూబ్ నగర్ జిలాల్లలో, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అనంతపూర్, కడప, చిత్తూరు నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో విస్తరించి వున్నాయి. ఇంత విస్తీర్ణంలో సాగు చేయబడుతున్నా రైతులు సరైన నేలలను ఎంపిక చేసుకోక, ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటించక, వివిధ తెగుళ్ళు ఆశించటం మూలాన నాణ్యమైన అధిక దిగుబడులు పొందలేక తోటలు తీసి వేస్తున్నారు. క్రింద తెలిపిన నూతన సాగు విధానాలను పాటిస్తూ, తెగుళ్ళ నివారణ చర్యలను సరైన సమయంలో చేపట్టినట్లయితే తెగుళ్ళను చాలావరకు నివారించవచ్చు.



**తెగుళ్ళ లక్షణాలు, నివారణ చర్యలు – వేరుకుళ్ళు తెగులు**

లక్షణాలు : తెగులు సోకిన చీనీ నిమ్మచెట్లు సరిపడ నీరుపెట్టినా కూడా వాడినట్లు ఉండి, ఆకులు వాడి జీవం కోల్పోతాయి. ఆకులు పసుపురంగుకు మారతాయి. వేర్ల బెరడు కుళ్ళిపోవటం ఈ తెగుళ్ళ ప్రథమ లక్షణం. ఆ తరువాత బెరడు ఎండిపోయి పొరలు, పొరలుగా ప్రధాన కాండం నుండి విడిపోతుంది. కుళ్ళిన వేర్లను తొలగిస్తే దుర్వాసన వస్తుంది. వేర్లపై నల్లటి స్లీరోషియాను ప్రస్ఫుటంగా చూడవచ్చు.

**కారణాలు :** నేలలో అధిక తేమ, నేరుగా చెట్టు కాండానికి సాగునీరు తగలడం, చెట్టుకు నీరు తక్కువగా అందటం, బరువైన నేలల్లో చెట్లను నాటడం, వేర్లకు తరచుగా గాయాలు ఏర్పడటం, మొక్కలను లోతుగా నాటక పోవటం, మొక్కల మధ్య దూరం తక్కువగా ఉండటం, ఎక్కువ మోతాదులో ఎరువులు ఒకే దఫా వేయటం, నత్రజని ఎరువులు, పశువుల ఎరువు , వేపచెక్క , ఆముదం చెక్క సరైన మోతాదులో అందించకపోవటం.

**నివారణ:** రోగ నిరోధక శక్తి ఉండే రంగపూర్నిమ్మ అంట్లు వేరు కుళ్ళు తెగులును బాగా తట్టుకుంటాయి.

- వేసవిలో నేలతడి ఆరిపోకుండా చెట్టుపాదుకు ఆకులు కప్పాలి.
- తోటల్లో జనుము, మినుము, పెసర, జీలుగ వంటి పచ్చిరొట్ట ఎరువు పంటను సాగు చేసి భూమిలో కలిసేలా దున్నాలి.
- పూతకుముందు చెట్టుకు పాదులలో 10 కిలోల చొప్పున వేపపిండి లేదా ఆముదపు పిండి లేదా గానుగపిండి వేయాలి.
- 100 గ్రాముల ట్రైకోడెర్మావిరిడె 20 లీటర్ల నీటిలో కలిపి పాదంతా తడిసేలా చల్లాలి. ఒక కిలో ట్రైకోడెర్మా కల్చరును 90 కిలోల పశువుల ఎరువు, 10 కిలోల వేపపిండి చొప్పున పాదులో వేసి కలియబెట్టాలి.
- ఈ లక్షణాలు ప్రాథమిక దశలో ఉన్నప్పుడే 20 గ్రాముల కార్బండాజిమ్ ,50 గ్రాముల మ్యాంకోజెబ్ 20 లీటర్ల నీటిలో కలిపి చెట్టు పాదంతా తడిసేలా నెల రోజుల వ్యవధిలో రెండుసార్లు పోయాలి.

**బంక తెగులు**

ఈ తెగులును బ్రౌన్రాట్, గమ్మోసిస్, బ్రౌన్కార్క్, ట్రంక్రాట్ , ఫుట్రాట్ అని అంటారు.

**కారణాలు:** కాలువల ద్వారా నీటిని పారించినప్పుడు మొక్క మొదలుకు నీరు నేరుగా తగలటం, దీర్ఘకాలం తడిసి ఉండటం, నీటినిలువ ప్రాంతాలు, నల్లనేలలు తెగుళ్ళ

ఉధృతిని పెంచుతాయి. అధిక వర్షపాత ప్రాంతాలలో ఈ తెగులు తీవ్రత ఎక్కువగా ఉంటుంది.

**లక్షణాలు :** ఫైటోఫ్తోరా బంక తెగులు బత్తాయితోటల్లో ఎక్కువగా కనిపిస్తుంది. బంక కారడం, బెరడు కుళ్ళడం **నివారణ:** అధిక నీటి మట్టం ఉన్న నేలలు, లోతట్టు ప్రాంతాలు, నల్ల రేగడి నేలలు నిమ్మ సాగుకు అనుకూలం కాదు. మురుగునీటి పారుదల సౌకర్యం ఉండాలి.

- మొక్కలు నాటేటప్పుడు అంటు భాగం మట్టిలోకి వెళ్ళకుండా జాగ్రత్త పడాలి.
- నీరు నేరుగా మొక్క కాండాన్ని తాకకుండా వుండ డానికి చెట్టు కాండం చుట్టూ నలభై ఐదు సెం.మీ.ల దూరంలో వలయాకారపు గట్టు (రింగు) ఏర్పాటుచేసి దానికి బయట మాత్రమే నీరు కట్టాలి.
- మొక్కకాండం మొదల్లో బోర్డోపేస్టు లేదా కాపర్ ఆక్సీ క్లోరైడ్ పేస్ట్ సంవత్సరానికొకసారి నేల నుండి 50-70సెం.మీ. ఎత్తువరకు కాండం చుట్టూ పూయాలి.

**బాక్టీరియా గజ్జి తెగులు**

గజ్జి తెగులును నిమ్మ, మోసంబి తోటల్లో ఎక్కువగా గమ నించవచ్చు. బత్తాయికన్నా,నిమ్మచెట్ల మీద ఎక్కువగా ఆశిస్తుంది.

**కారణాలు :** వాతావరణంలో ఉష్ణోగ్రత 20-30$^{0}$ సెంటీగ్రేడ్ వద్ద, అధిక తేమతో కూడిన వాతావరణంలో తెగుళ్ళు సోకే ప్రభావం ఎక్కువ.

**లక్షణాలు :** లేత ఆకులు, చిన్న కొమ్మలు, కాయలపై, ముళ్ళ మీద, పెద్ద కొమ్మల మీద, కాండం మీద చివరకు ఒక్కోసారి వేరుపైన ఈ మచ్చలు సోకి నష్టం కలిగిస్తాయి, తెగులు ముదిరిన దశలో చెట్లు ఎండిపోతాయి. తెగులు సోకిన చెట్లపై ఎండుపుల్ల ఎక్కువగా కనిపిస్తుంది. గజ్జి సోకిన కాయలు నాణ్యత కోల్పోయి తొందరగా రాలిపోతాయి. మార్కెట్లో ధర కూడా పలకదు. తెగులు ఎక్కువైనప్పుడు కాండం వేర్ల మీద కూడా గజ్జి కనబడుతుంది.

**నివారణ:**

- గజ్జిని తట్టుకొనే బాలాజీ నిమ్మ, పెట్లూరు సెలక్షన్ అనే రకాలను నాటుకోవాలి
- తెగులు సోకిన, ఎండిన కొమ్మలను కత్తిరించి నాశనం చేయాలి.
- 3 గ్రా. స్ట్రెప్టోసైక్లిన్ లేదా 3 గ్రా. బాక్టీరియో మైసిన్ కాపర్ ఆక్సీక్లోరైడ్ 30 గ్రా. మందును 10 లీటర్ల నీటిలో కలిపి వర్షాకాలంలో 20 రోజులకొకసారి చొప్పున 4 సార్లు పిచికారి చేయాలి.

**కాయ తొడిమ కుళ్ళు తెగులు :**

లక్షణాలు : తొడిమ చుట్టూ వక్కరంగులో వలయాకారంలో కుళ్ళు మచ్చ ఏర్పడుతుంది. క్రమంగా ఈ మచ్చ వ్యాపించి కాయ లోపల కుళ్ళి మెత్తబడుతుంది. ఇలాంటి కాయలు చెట్టుకు అంటి పెట్టుకుని ఉండటం కాని, రాలిపోవడం కానీ జరుగుతుంది.

**నివారణ:** ఒక లీటరు నీటికి ఒక మి.లీ. హెక్సాకొనజోల్ లేదా 2 మి.లీ. ప్రొఫికొనజోల్ లేదా ఒక గ్రాము కార్బండాజిమ్ ఒక లీటరు నీటిలో కలిపి నెలకొకసారి కాయలు పూర్తిగా తడిసేలా పిచికారి చేయాలి.

**తెగుళ్ళను అధిగమించే పద్ధతులు**

- భూమిలో సారం పెరిగేలా క్రమం తప్పకుండా సేంద్రియ ఎరువులను వాడాలి.
- పచ్చిరొట్ట పంటలైన జనుము, జీలుగను బత్తాయి చెట్ల మధ్య ఖాళీస్థలంలో చల్లాలి.
- మొగ్గదశ వచ్చినప్పుడు నేలలో కలియదున్నితే భూసారం పెరుగుతుంది.
- ఫర్టిగేషన్ పద్ధతితో నీరు, పోషకాలు ఏడాది పొడవునా కావాల్సిన పరిమాణంలో అందించాలి.
- వేరు వ్యవస్థ దెబ్బ తినకుండా పాదుల్లో ఎక్కువగా నీరు నిల్వ ఉంచవద్దు.
- నీటిలో కరిగే రసాయనిక ఎరువులను వాడాలి.
- నీరు వృధా కాకుండా చెట్లపాదుల్లో వరి ఊక, వేరుశనగ పొట్టుతో మల్చింగ్ చేయాలి.
- దీనివల్ల సేంద్రియ ఎరువు కూడా పెరుగుతుంది.

■

# చికెన్ ఉత్పత్తులకు విలువ జోడింపుపై శిక్షణ

**– రాజశేఖర్**

**హై**ఫర్ ఇంటర్నేషనల్ ద్వారా హెచ్‌హెచ్ఏఐ ప్రాజెక్ట్ సపోర్ట్‌లో భాగంగా పామిడి, పెద్దవడుగూరు మండలాల్లో పెరటి కోళ్ళ పెంపకాన్ని ప్రోత్సహించేందుకు ఏపిమాస్ కృషి చేస్తున్నది. పౌల్ట్రీ రైతుల ఆదాయాన్ని పెంచడానికి ఉత్పత్తిలో విలువను జోడించడం కోసం, అనంతపురంలో 2022 సెప్టెంబర్ 12,13 తేదీలలో 2 రోజుల రెసిడెన్షియల్ శిక్షణను హైఫర్ ఇంటర్నేషనల్ నిర్వహించింది. ఈ శిక్షణ స్నేహ కుంజ ట్రస్ట్ కార్యాలయంలో జరిగింది. శ్రీమతి యెశ్రిత రిసోర్స్ పర్సన్.



చికెన్‌తో, చింతపండుతో ప్రాసెస్డ్ ఫుడ్ ఐటమ్స్ చేయడం ద్వారా వ్యవసాయ ఆదాయానికి అదనంగా మరికొంత ఆదాయాన్ని సంపాదించడం ఈ శిక్షణ ప్రధాన లక్ష్యం.

ఏపిమాస్, స్నేహ కుంజ ట్రస్ట్ ద్వారా ప్రమోట్ చేయబడిన ఎఫ్‌పిఓల రైతులు, పాలకవర్గ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు. ముందుగా కోడి మొత్తం శరీర భాగాలను అంటే మునగ, తొడ, రెక్కలు, గుజ్జు, కాలేయం మొదలైన వాటి గురించి శిక్షకుడు వివరించాడు. కోడిని వేర్వేరుగా కత్తిరించినపుడు, చికెన్ను ఉప్పు ద్రావణంలో, ఫ్రిజ్లో, తక్కువ ఉష్ణోగ్రతలో ఎండబెట్టడం,ఎండిన మాంసం రూపంలో లేదా మ్యారినేట్ చేసిన కోడిమాంసం రూపంలో, చికెన్ ఊరగాయ మొదలైనవి సిద్ధం చేయవచ్చు. చికెన్ను ప్లాస్టిక్ సంచుల్లో - $4^0$ సెంటీగ్రేడ్ వద్ద రిఫ్రిజిరేటర్లో 10 రోజుల వరకు నిల్వ చేయవచ్చు.

**కోడి నష్టాల దశలు**

దశ 1 : – మాంసంపై గులాబీ రంగు పొర

దశ 2 : – మాంసంపై ఆకుపచ్చని పొర

దశ 3 : – మాంసంపై తెల్లటి పొర, ఆకుపచ్చని పొర

దశ 4 : – అంటుకునే స్వభావంతో తెల్లటి పొర, ఆకుపచ్చని పొర

**నాణ్యత తనిఖీలో పరిగణించవలసిన అంశాలు:**

1. లేత ఉప్పు, ఎక్సక్లేటివ్

   – ఆకుపచ్చ ,అంటుకునే స్వభావం

   – చికెన్ చెడిపోయినప్పుడు నీటిలో ఉంచినప్పుడు ఎక్కువ నీటిని గ్రహిస్తుంది

   – మాంసం మృదువైనది

2. ముదురు అంచు పొడి :-

   – మాంసం తేమను కోల్పోయి, ఎరుపు రంగులోకి మారుతుంది.

శ్రీమతి యెశ్రిత కూడా నగ్గెట్స్ వంటి చికెన్ విలువ జోడించిన ఉత్పత్తులకు మార్కెట్ డిమాండ్ గురించి చర్చిం చారు. చికెన్ సంబంధిత ఉత్పత్తులతో పాటు, అరటి చిప్స్, ఫ్లవర్ పికిల్, జ్యూస్, ట్యాబ్లెట్స్, జామ్‌వంటి అరటి విలువ ఆధారిత వస్తువుల గురించి కూడా ఆమె చర్చించారు. కేకులు, చిక్కీలు, సాల్టెడ్ వేరుశెనగలు, వేరుశెనగ, వెన్న వంటి గ్రౌండ్‌నట్ విలువఆధారిత ఉత్పత్తుల గురించి కూడా ఆమె చర్చించారు.

**కోడిని ప్రాసెస్ చేయడంలో ఉండే దశలు :** పక్షుల సేకరణ, కరెంట్ షాక్ (హత్య కోసం పక్షులను వేడి నీటి ద్రావణంలో ముంచండి), ఈకలను తొలగించండి, పక్షిలోని అవాంఛిత



పదార్థాన్ని తొలగించండి, మీ ఉత్పత్తి, ప్యాకేజింగ్ అవసరాన్ని బట్టి ముక్కలను కత్తిరించండి.

**చికెన్ ఊరగాయ:**

*చికెన్ ఊరగాయ తయారీకి కావలసిన పదార్థాలు:*

- చికెన్ – 1000 గ్రా
- ఉప్పు – 60 గ్రా
- పసుపు – 30 గ్రా
- అల్లం వెల్లుల్లి పేస్ట్ – 60 గ్రా
- మిరియాల పొడి – 50
- ధనియాల పొడి – 70
- నూనె – 750 మి.లీ
- నిమ్మరసం – 2 టేబుల్ స్పూన్లు.

**చికెన్ ఊరగాయ తయారీ విధానం:–**

– ముందుగా చికెన్ను నీట్‌గా శుభ్రం చేసుకోవాలి.

– చికెన్లో పసుపు , ఉప్పు కలపండి .నీరు ఆవిరై, రంగు మారే వరకు ఉడకబెట్టండి.

– నూనె వేడయ్యాక ఉడకబెట్టిన చికెన్‌ను వేయించి తీసేయాలి.

– వేడిచేసిన నూనెలో వెల్లుల్లి , అల్లం పేస్ట్ వేసి రంగు మారే వరకు వేయించాలి.

– కారం , ధనియాల పొడి జోడించండి.

– చల్లారిన తర్వాత నిమ్మరసం వేయాలి

– జాడీలను ఆటోక్లేవ్ చేయండి (కుక్కర్లో కూజాను ఉంచి 3 విజిల్స్ వరకు ఉడికించాలి)

– కూజాను శుభ్రం చేసి, అది ఆరిన తర్వాత ఊరగాయను జాడీలో ఉంచండి.

**చింతపండు చాక్లెట్లు:**

చింతపండు చాక్లెట్ల తయారీకి కావలసిన పదార్థాలు:–

- చింతపండు – 100 గ్రా
- బెల్లం – 100 గ్రా
- నీరు – 100 మి.లీ

*చింతపండు చాక్లెట్ల తయారీ విధానం:–*

– నీటిని వేడి చేసి, చింతపండును రెండు గంటల వరకు నీటిలో నానబెట్టండి

– బాణలిలో (పాన్లో) పేస్ట్ వేసి, గుజ్జులో బెల్లం వేసి రంగు మారే వరకు వేయించాలి.

– చిటికెడు ఉప్పు వేసి, పేస్టును మిక్స్ చేయండి

– అది చల్లారిన తర్వాత చాక్లెట్ బాల్స్‌ను తయారుచేసి, చక్కెర పొడితో కోట్ చేయండి.

**చికెన్ చిప్స్:**

*చికెన్ చిప్స్ తయారీకి కావలసిన పదార్థాలు:*

- చికెన్ – 250 గ్రా, ఉప్పు – 10 గ్రా
- పసుపు – 2.5 గ్రా
- జీరా పొడి – 3 గ్రా
- కార్న్‌ఫ్లోర్ – 5 గ్రా
- గోధుమ పిండి – 5 గ్రాములు

**చికెన్ చిప్స్ తయారీ ప్రక్రియ:**

–పైన చెప్పినవన్నీ బోన్లెస్ చికెన్లో మిక్స్ చేసి పేస్ట్‌లా రుబ్బుకోవాలి.

– సన్నని పొరతో పిండిని రోల్ చేయండి.

– ఆకారాలుగా కట్ చేసి నూనెలో వేయించాలి.

పక్షులు గరిష్ట బరువుకు చేరుకున్నందున వీలైనంత త్వరగా చికెన్ విలువ జోడింపు కార్యకలాపాలను ప్రారంభించాలని హైఫర్ ఇంటర్నేషనల్ బృందం శిక్షణలో పాల్గొన్నవారికి సూచించింది. ■

మరికొంత ఓపికపట్టి, మరికొంచెం పట్టుదలతో కృషిచేసివుంటే ఎందరో పరాజితులు విజేతలయ్యేవారు

# బాహ్య పరాన్నజీవులద్వారా సోకే వ్యాధులు

– డా. భార్గవి

గోమార్లు, మిన్నల్లులు, పేలు, పిడుదులు, దోమల వంటి పరాన్నజీవులు పశువుల,జీవాల, కుక్కల శరీరాలపై ఆశ్రయం ఏర్పరచుకొని, వాటి రక్తాన్ని పీల్చి రక్తహీనతకు, బలహీనతకు గురి చేస్తాయి. వీటివల్ల పాడి పశువులు చికాకుపడడం,మేత తినకపోవడం, తద్వారా పాల దిగుబడి తగ్గిపోవడం సంభవిస్తుంది. బాహ్యపరాన్నజీవులు వర్షాకాలంలో మురుగు నీరు, రొచ్చు చెత్తా చెదారం ఉండే అపరిశుభ్ర పరిస్థితులలో ఎక్కువగా ఆశిస్తూ , అనేక వైరల్, బాక్టీరియల్, ప్రోటోజువల్ వ్యాధుల్ని వ్యాపింపజేసి పశునష్టం కలిగిస్తుంటాయి.



- గోమార్లు ఎక్కువగా పశువులు, జీవాలని, తక్కువగా కుక్కలని ఆశిస్తాయి. ఇవి మూడున్నర ఏళ్ళవరకు చెవి లోపలి భాగంలో ఉంటాయి. దీనివల్ల పశువులు తలను ఎక్కువగా ఆడిస్తూ ఉంటాయి. చర్మం దురద, వాపులాంటివి ఎక్కువగా గమనిస్తాం. ఇవి రోజుకు 0.5 మి.లి. రక్తాన్ని తీసుకుంటాయి. రక్తాన్ని పీల్చడంవల్ల రక్త క్షీణతతో పాటు ఆ భాగంలో గాయాలు ఏర్పడతాయి. గోమార్లు శరీరంలోకి విషపదార్థాలు విడుదల చేయడం వల్ల ముఖ్యముగా వెనుక కాళ్ళు పక్షవాతానికి గురవుతాయి. బెబీసియోసిన్, థైలేరియాసిన్ వంటి వ్యాధులు సోకడంలో ఈ గోమార్లు మధ్యవర్తులుగా వ్యవహరిస్తాయి.
- మిన్నల్లులలో సార్కోప్స్, సోరాప్స్, డమోడెక్స్ అనే మూడు రకాలు ఉంటాయి. సారోప్స్ మిన్నల్లులు, చెవి, భుజం, ముఖం, తోక ప్రారంభం మొదలైన భాగాల్ని ఆశిస్తాయి. తద్వారా దురద, వాపు చర్మంపై పొలుసులు ఏర్పడి పాలిపోవడం జరుగుతుంది. రక్తస్రావం, వెంట్రుకులు రాలిపోవడం, పొలుసులు రావడం ముఖ్య లక్షణాలు. డెమోడెక్సు మిన్నల్లుల వల్ల దురద, చీముతో కూడిన కురుపులు ఏర్పడతాయి.
- పేలు, పిడుదులు, శరీరంపై ఆశించడం వల్ల దురద, గిల్లడం వల్ల చర్మం వాచి ఎర్రబడడం, గాయం, రక్తహీనతకు లోనవ్వడం సంభవిస్తుంది.
- దోమలు శరీరంపై వాలి రక్తం పీలుస్తాయి. దురదను కలిగిస్తాయి. పుండ్లలో లార్వాలు ఉండి, తర్వాత అవి మాగట్స్ (పురుగులు) గా వృద్ధి చెందుతాయి. పశువులు చికాకు, అలసట, నీరసానికి లోనవుతాయి. పాలదిగుబడి తగ్గుతుంది. దోమల వల్ల కురంవ్యాధి, మెదుడువాపు వ్యాధి వ్యాపిస్తుంది.
- జోరీగల ద్వారా పశువుల్లో సర్రా, మశూచి వంటి వ్యాధులు వ్యాపిస్తాయి.

**బాహ్య పరాన్నజీవుల నిర్మూలన**

- బాహ్య పరాన్నజీవుల నిర్మూలనకు మలాథియాన్, డిడిటి, బిహెచ్‌సి తగు మోతాదుల్లో శరీరంపై పిచికారి చేయాలి. బ్యూటాక్స్, ట్యాక్ టిక్ మొదలగు అనేక మందులు మార్కెట్‌లో లభిస్తున్నాయి
- మిన్నల్లుల నివారణకు చర్మంపై రాయడానికి బెంజైల్ బెంజోయేట్, కిస్కిన్ లాంటి ఆయింట్మెంట్లను వాడవలసి ఉంటుంది.
- గోమార్లు, మిన్నల్లులు, పేలు మొదలగు బాహ్య పరాన్నజీవుల నిర్మూలనకై మందులతో పాటు ఐవర్ మెక్టిన్ ఇంజక్షన్ 50 కిలోల శరీర బరువుకు 1 మి.లీ. చొప్పున చర్మం కింద వేయించాలి. డమోడెక్స్ రకం మిన్నల్లుల నిర్మూలనకు ఈ ఇంజక్షన్ను వారం వ్యవధిలో 4 లేదా 5 సార్లు చేయించాలి. బాహ్య

ఆశాభావమే విజయానికి ప్రాణాధారం; ఆశాభావం,ఆత్మవిశ్వాసం లేనిదే ఏదీ సాధించలేము

పరాన్నజీవుల వల్ల చర్మంపై ఏర్పడిన గాయాలలో, పుండ్లలో బాక్టీరియా వృద్ధి కాకుండా వాటిని యాంటీ సెప్టిక్‌తో శుభ్రం చేయాలి. అవసరాన్ని బట్టి యాంటీబయోటిక్‌లను కూడా వాడాలి.

- దోమలు రాకుండా నివారణ కోసం సాయంత్రపు వేళలో వేపాకు పొగ గాని, జామాయిల్ ఆకు పొగ గాని పెడితే ఉపయోగం ఉంటుంది.
- బాహ్య పరాన్నజీవుల నిర్మూలనకు వాడే మందుల్ని స్ప్రేయింగ్, డిప్పింగ్, డస్టింగ్ మొదలగు పద్ధతుల్లో వాడతారు. స్ప్రేయింగ్ సమయంలో మందులు కళ్ళల్లో, నోటిలో పడకుండా జాగ్రత్త వహించాలి.
- డిప్పింగ్ సమయంలో పశువుల్ని మందుల ద్రావణంలో కనీసం 5 నిమిషాలు ఉంచాలి. రెండు లేదా మూడు మాసాలకు డిప్పింగ్ చేయాలి. గొర్రెలకు, మేకలకు ఈ పద్ధతి శ్రేయస్కరమైనది. ఇక బాహ్య పరాన్నజీవులు ఎక్కువగా ఉండే శరీర భాగాల్లో డస్టింగ్ లేదా మందు చల్లడంద్వారా వాటిని నిర్మూలించాలి. మందు పశువుల కళ్ళల్లో,నోట్లో, ముక్కుల్లో పడకుండా జాగ్రత్తపడాలి. షెడ్డులో పశువులపై మందుల్ని ఒకేసారి వాడాలి.
- పశువుల వెంట్రుకల్ని కత్తిరించడం, ప్రతిరోజు దువ్వడంద్వారా పేలు, మిన్నల్లులను నిర్మూలించవచ్చు.
- వర్షాకాలంలో మురుగునీరు నిల్వ వుండకుండా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి. పశువులశాలల గోడలను, గోడల మధ్య పగుళ్ళను క్రిమిసంహారకాలను పిచికారి చేసి శుభ్రం చేయాలి. గోమార్లు పశువు నుంచి వేరే పశువుకు పాకకుండా బాహ్య పరాన్నజీవులను నిర్మూలించిన తర్వాతే, మిగతా పశువులతో కలవనియ్యాలి, షెడ్లను ఫ్యూమిగేట్ చేయాలి. షెడ్ల లోపల, పరిసరాల్లో సున్నం చల్లాలి.
- బాహ్య పరాన్నజీవుల సమస్య వల్ల పశువుల్లో రక్తహీనత సమస్యఎక్కువగా ఉంటుంది. కావున రక్తహీనత సమస్య ఉన్న పశువులకు ఫెర్రిటాస్ మాత్రలు లేదా బెల్లం నీటిని విరివిగా వాడాలి.

## ఎఫ్ పి ఓలు పండించే ఎండు మిర్చికి మార్కెటింగ్


**తె**లంగాణా రాష్ట్రంలోని మహిళా ఫార్మర్స్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్స్ ( మహిళా ఎఫ్ పి ఓలు) పండించే ఎండు మిర్చికి విస్తృత మార్కెటింగ్ అవకాశాలు కల్పించేందుకు ఈ కామర్స్ సంస్థతో రాష్ట్ర పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ఒప్పందం కుదుర్చుకుంది. హైదరాబాద్ బేగంపేట హరిత ప్లాజాలో ఇటీవల నిర్వహించిన ఒక కార్యక్రమంలో రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శ్రీ ఎర్రబెల్లి దయాకర్‌రావు సమక్షంలో సెర్ప్ సి ఇ ఓ శ్రీ సందీప్ కుమార్ సుల్తానియా, ఈ కామర్స్‌సంస్థ ప్లాంట్ లిపిడ్స్ కంపెనీ ఎండీ జాన్ నేచుపాదం ఎండుమిర్చి మార్కెటింగ్ ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు.



కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి ఎర్రబెల్లి మాట్లాడుతూ ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ రైతులు పండించిన మిర్చి పంటను కొనుగోలు చేయడానికి ముందుకొస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని అన్నారు. మిర్చికి ప్రోత్సాహం లేదని నిరుత్సాహ పడొద్దని, కంపెనీలు ఆసక్తి చూపుతున్నాయని మహిళా సంఘాలకు సూచించారు. ఈ ఏడాది రూ.200 కోట్ల బిజినెస్ టార్గెట్‌తో ముందుకు సాగాలన్నారు. ప్రభుత్వం స్వయం సహాయక సంఘాలకు రూ.15 వేల కోట్లకు పైగా రుణాలు ఇవ్వడంతో పాటు అడిగిన పనులన్నీ అమలు చేస్తోందని చెప్పారు. ప్లాంట్ లిపిడ్స్ కంపెనీ ఎండీ జాన్ నేచుపాదం మాట్లాడుతూ 15వేల ఎకరాల విస్తీర్ణంలో తమ కంపెనీ తెలంగాణ, కర్నాటక ప్రాంతాల్లో ఎండుమిర్చి వ్యాపారంలో ముందంజలో ఉన్నట్లు తెలిపారు. సాగు పద్ధతులు, గ్రేడింగ్ తదితర విషయాలపై రైతులకు శిక్షణా కార్యక్రమాలు నిర్వహించి అవగాహన కల్పిస్తామని చెప్పారు. ■

# పాడి పశువులలో పొదుగువాపు వ్యాధి నివారణ

పొదుగు వాపు వ్యాధి ప్రపంచవ్యాప్తంగా పశు పోషకులను, పశువైద్యులను తీవ్రంగా కలవరపరుస్తూ సవాలు విసురుతున్నది. పాడి రైతులకు ఈ వ్యాధి మొదటి శత్రువు. వ్యాధి సోకిన పొదుగు భౌతిక, రసాయనిక మార్పులకు గురి చెంది, పాల దిగుబడి, పాల నాణ్యత కోల్పోయి పాలు వినియోగానికి పనికిరావు. అధిక వ్యయ ప్రయాసలకోర్చి వైద్యమందించినా, పొదుగు తాత్కాలికంగా లేదా శాశ్వతంగా పనికి రాకుండా పోతుంది. రైతులు అధిక నష్టాలకు లోనవుతారు .



**పొదుగు వాపు కారణాలు**

1. సూక్ష్మ క్రిములు 2. మనిషి 3. పశువు 4. పరిసరాలు.

**పొదుగు వ్యాధి వ్యాపించు విధానం**

1. రోగ క్రిములు వ్యాధి సోకిన పొదుగు నుండి ఇంకొక పశువుకు ఈగల ద్వారా, పాలు పితికే వారి మురికి చేతుల ద్వారా, కలుషితమైన పరిసరాల ద్వారా, పాలు పితికే యంత్రాల ద్వారా వ్యాపిస్తాయి.
2. పొదుగునకు గాయమైనపుడు దూడలపళ్ళు, పితికే వారి గోళ్ళ ద్వారా సూక్ష్మ క్రిములు పొదుగును చేరి వ్యాధిని కలిగిస్తాయి.
3. పాలు పూర్తిగా తీయకపోయినా రావచ్చు.
4. పాలు పితికిన తర్వాత పొదుగు శుభ్రము చేయక పోవడం వలన.

**ఐదు రకాల పొదుగువాపు వ్యాధి**

1. మొదటి రకం: లక్షణాలు సరిగా కనిపించవు. అందువలన రైతులు సరిగ్గా గుర్తించక పోవచ్చు కానీ పొదుగు వాపు వ్యాధి ఉంటుంది.
2. రెండవ రకం: చాలా తీవ్రంగా ఉంటుంది. పశువుకు జ్వరం వచ్చి మేత సరిగా తినకపోవటం లాటి లక్షణాలు కనిఎస్తాయి.
3. మూడవ రకం : లక్షణాలు తొందరగా కనిపిస్తే పొదుగు వాచి వెచ్చగా ఉంటుంది
4. నాల్గవ రకం : పాల దిగుబడి తగ్గిపోయి పాలల్లో రక్తపు జీరలు, కదుపులు లేదా చీము ఉంటుంది. పాలు చిక్కబడి, పాల గాఢత పెరుగుతుంది
5. ఐదవ రకం: పాలు పలచబడిపోయి, గాఢత తగ్గుతుంది. కదుపులు ఎక్కువగా ఉంటాయి. పాలు గోధుమ రంగుకు మారుతాయి.

**లక్షణాలు**

పొదుగులోని అన్ని చన్నులు లేదా కొన్ని వాచి, వేడిగా, నొప్పిగా వుంటాయి. వ్యాధి సోకిన పొదుగు గట్టిగా వుంటుంది. పాలలో రక్తం లేదా చీము చేరి పాలు దుర్వాసన కలిగి వుంటాయి. పాలలో కదుపులు వుంటాయి. పాలు తీసినపుడు, పాలు కాకుండా, నీళ్ల వంటి పదార్ధంలాగా లేదా పాలు గట్టిపడి తీగలుగా, జిగటగా వస్తాయి. పశువు జ్వరం వచ్చి నీరసంగా వుంటుంది. నీళ్ళు త్రాగదు, మేత మేయదు. పాల దిగుబడి గణనీయంగా తగ్గుతుంది. పాల నాణ్యత లోపిస్తుంది. పాల రుచి మారుతుంది. వ్యాధి తీవ్రతను బట్టి కొన్ని సందర్భాలలో ఒకటి లేక అన్ని చన్నులు గట్టి పడి (ఫైబ్రోసిస్) పోతాయి. పొదుగు పూర్తిగా ఉపయోగం లేకుండా పోతుంది.

**పొదుగు వాపు గుర్తించే విధానం**

నల్లని గుడ్డపై పాలు పితికి చూడాలి. గుడ్డపై చీము,

రక్తం, కదపలు కనిపిస్తే వెంటనే చికిత్స చేయడం ప్రారంభించాలి.

**వైద్యం**

పొదుగుకు వాపు వ్యాధి సోకిందన్న అనుమానం రాగానే ఆలస్యం చేయకుండా పశు వైద్యుణ్ణి సంప్రదించాలి. సాధారణగా జెంటామైసిన్, సెఫెలెక్సిన్, ఆమ్పిసిలిన్, కక్ససిలిన్, ఫ్లోక్షిదిన్, సెఫ్ట్రీయాక్సన్, సెఫ్టియోఫోర్ సోడియం మొదలగు ఏంటి బయోటిక్స్ వాడవచ్చు. నొప్పి ఎక్కువగా వుంటే మిగ్లోదయన్, మెలక్షికమ్ , కట్టిజోన్స్ వాడాలి. పొదుగు పైన పూతకు మష్టిలేప్, విస్పెర్క్ లేదా ఇతర మలాములను, స్ప్రేలను వాడాలి.

యాంటిబయాటిక్ ట్యూబుల ద్వారా పొదుగులోకి ఎక్కించినందు వలన కూడా వ్యాధిని అదుపు చేయవచ్చు. మమ్మిడియం, మాస్ట్ కేర్, మాస్టఫాస్ట్ పౌడర్లను నోటి ద్వారా యివ్వవచ్చు.

**వాడుకలో వున్న కొన్ని నాటు చికిత్సలు**

- నొప్పి తగ్గటానికి కలబంద 2 పట్టలు, సున్నము 25 గ్రాములు, పసుపు 25గ్రా, నిమ్మరసం 20 మిల్లీలీటర్లు కలిపి రుబ్బి, గంటకు ఒక మారు పొదుగుకు పూయాలి.
- కొందరు అసెటిక్ ఆసిడ్ లేక నిమ్మరసం, చాక్‌పీసుల పొడి కలిపి పూస్తారు.
- ఐసు గడ్డలను పలచటి గుడ్డలో వేసి పొదుగుకు రోజుకు వీలైనన్ని మార్లు కట్టాలి.
- హూమియోపతి మందులు సల్ఫర్, కార్బోవెజ్, సిలిషియా, ఆరం మ్యారియాటికం నేట్రోనేటం, కాల్కేరియా ఫ్లోర్, కోనియం మొదలగు మందులు నిపుణులైన వైద్యుల సలహాతో వాడవచ్చు.
- 50 నుండి 60 గ్రాముల వెల్లుల్లి దంచి తినిపించ వచ్చు.
- ప్రతి మూడు, నాలుగు రోజులకొకసారి అరకిలో మొలక ఉలవలు ఉడికించి, రుబ్బి పశువులకు తినిపించితే, దానిలోని 'సెలీనియం' , 'విటమిన్ ఇ' పొదుగు వాపును అరికట్టగలవు. పాల నాణ్యత,దిగుబడి పెరుగుతుంది.

**నివారణ చర్యలు**

1. పాడి పశువులను శుభ్రమైన ప్రదేశంలో ఉంచాలి.
2. పొదుగును గోరువెచ్చటి నీటితో రుద్దుతూ కడిగి శుభ్రమైన గుడ్డతో తుడవాలి.
3. పాలు పితికే రైతు చేతి వేళ్ళకు గోళ్ళు లేకుండా శుభ్రంగా ఉంచుకోవాలి.
4. పొదుగులోని పాలను వేగంగా, పూర్తిగా పితకాలి. కొన్ని పాలను పొదుగులో వదిలేస్తే వ్యాధిసోకే అవకాశాలు ఎక్కువ.
5. పాలు పితికిన వెంటనే పశువు పడుకోకుండా, మేత,



దాణా అందించాలి. పశువు 20 నుండి 30 నిమిషాలు వరకు పడుకోకుండా చూసుకోవాలి.
6. గర్భకోశ వ్యాధుల పీడిత పశువుల , ఈనిన పశువుల మలం నుంచి కారే స్రవాలు పొదుగుకు తగలకుండా ఎప్పటికపుడు శుభ్రపరచాలి.
7. పొదుగుకు ఏదైనా గాయాలు అయినప్పుడు వెంటనే శుభ్రంచేసి యాంటిసెప్టిక్ ఆయిట్మెంట్‌ని పూయాలి.
8. పొదుగువాపు సోకిన పశువుల నుండి పాలు చివరగా పిండాలి.

'పొదుగ ఎవాపు వ్యాధి వచ్చిన తరువాత వైద్యం చేయించడం కన్నా నివారణ కోసం కృషి చేయడం అవసరం'. ■

కృషికి మంచి సమయం రేపెప్పుడో కాదు, ఇప్పుడే, ఈ క్షణమే!

# ఏపిమాస్ బృందంచే ఇండ్ బ్రో ఇంక్యుబేటర్ల సందర్శన

– రాజశేఖర్

**డా**క్టర్ గోపాల్‌రెడ్డి , డాక్టర్ హసన్ , డాక్టర్ భార్గవి, శ్రీమతి అనూష , శ్రీ నారాయణస్వామి, శ్రీ మధుసూధన్ రెడ్డి లతో కూడిన ఏపిమాస్ బృందం 2022 సెప్టెంబర్ 2వ తేదీన ఇండ్ బ్రో (ఐ ఎన్ డి బి ఆర్ ఓ) బ్రీడింగ్ ఫామ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌ని సందర్శించారు. వారు ఇండ్ బ్రో రంగు బ్రాయిలర్, రెయిన్బో , ఎస్ టి ఆర్, బ్రౌన్ రోస్టర్ని ప్రమోట్ చేస్తున్నారని ఈ బృందం గమనించింది. వారు 3.5 లక్షల సామర్థ్యం గల ఇంక్యుబేటర్లను నిర్వహిస్తున్నారు. గుడ్ల సేకరణ, గుడ్ల నిల్వ, ఇంక్యుబేటర్లలో అమర్చడం, కోడిపిల్లలను పంపడం వంటి మొత్తం ప్రక్రియ పూర్తిగా క్రమపద్ధతిలో ఉంటుంది.

- చాలా రుచికరమైనది
- తక్కువ టెక్నాలజీ ఇన్పుట్
- మధ్యస్థ ఆకృతి
- పెరడుకు అనుకూలం
- బహుళ వర్ణ దేశీ పక్షులు

**రంగు బ్రాయిలర్ లక్షణాలు**

49వ రోజు ముగిసే సమయానికి మగపక్షి బరువు – 2.3 కిలోలు ; ఆడపక్షి సగటు బరువు – 2.0 కేజీలు, ఫీడ్ మార్పిడి నిష్పత్తి 1.9






ఇండ్ బ్రో అసీల్ పక్షులు పుష్టిగా, ఒకేరకంగా మెరుగైన శక్తితో ఆరోగ్యకరంగా వుంటాయి. కోడిపిల్లలను “ఆల్ ఇన్ ఆల్ అవుట్” ప్రాతిపదికన పెంచాలి.

**బ్రౌన్ లేయర్**

190 రోజుల నాటికి గరిష్ట ఉత్పత్తి 93% వరకు ఉంటుంది మరియు 345 గుడ్ల ఉత్పత్తి ఉంటుంది. ఈ బృందం రెయిన్బో రూస్టర్ బర్డ్ (50 రోజుల్లో సిద్ధంగా ఉన్న దేశీ రకం పక్షి) వంటి ఇతర రకాలను కూడా సందర్శించి, ఈ లక్షణాలను గమనించింది.

- తక్కువ కొవ్వు, వినియోగదారునికి చాలా ఆరోగ్యకరమైనది

వారు కఠినమైన బయో సెక్యూరిటీ చర్యలను అనుసరిస్తున్నారు. ఇవి పొదగడం నుండి పెద్ద పక్షుల వరకు పక్షుల మరణాలను తగ్గించడంలో సహాయపడుతుంది.

వారి ఫీడ్ మిల్లు ద్వారా వారు మొక్కజొన్న ప్రధాన భాగమైన దాణాను స్వయంగా సిద్ధం చేసుకుంటున్నారు

(మొక్కజొన్నను తాము స్వయంగా సాగు చేయడంతోపాటు, అవసరాన్నిబట్టి తమ పొలానికి సమీపంలోని రైతుల నుండి సేకరిస్తున్నారు)

డా.కోటేశ్వరరావు గారితో చర్చలు జరిపిన తర్వాత బ్రౌన్ లేయర్ను గుడ్లు పెట్టడానికి,అసీల్ పక్షులను మాంసం

వ్యక్తిత్వమనేది హఠాత్తుగా ఊడిపడదు; ఎంచుకునే మార్గం, అనుసరించే విధానమే దాని చిరునామా



కోసం తమ కార్యక్షేత్రాల ప్రాంతాలలో ప్రచారం చేయాలని ఈ బృందం అభిప్రాయపడింది.

ఏపిమాస్ బృందం ఆ తర్వాత 'రామా ఇంక్యుబేటర్స్ ప్రైవేట్ లిమిటెడ్'ను, పౌల్ట్రీ ఇంక్యుబేటర్లు, హేచర్ల ఎగుమతిదారులను సందర్శించింది.

వారు డిజిటల్ టైమర్ లేదా ఆటోమేటిక్ టర్నింగ్ కంట్రోల్ సిస్టమ్, ఉష్ణోగ్రత నియంత్రణ, ఆటోమేటిక్ ఎగ్జాస్ట్ సిస్టమ్, నియంత్రిత తేమ, రాగి పైపు కూలింగ్ కాయిల్స్, సెట్టింగ్ ట్రేలు, హాచింగ్ ట్రేలు, ఉష్ణోగ్రత మార్పులను సూచించడానికి అలారం బెల్‌తో విభిన్న సామర్థ్యాల ఇంక్యుబేటర్లను సిద్ధం చేస్తున్నారు.

ఈ బృందం 300, 1000, 10000 కెపాసిటీ ఇంక్యుబేటర్ల కోసం కొటేషన్లను సేకరించింది. వీటిలో రైతు



వ్యక్తిగత ప్రయోజనం కోసం 300 కెపాసిటీ ఇంక్యుబేటర్, ఎఫ్‌పిఓ స్థాయిలో 1000 ఎగ్ కెపాసిటీ ఇంక్యుబేటర్ మంచిదని తెలుసుకున్నాము.

300, 600, 1000 గుడ్ల సామర్థ్యం గల ఇంక్యుబేటర్లలో గుడ్లు అమర్చడం , కోడిపిల్లలు పొదుగడం రెండూ ఒకే కంపార్ట్మెంట్లో ఉంటాయి. ఎఫ్‌పిఓ స్థాయిలో 10,000 కెపాసిటీ ఇంక్యుబేటర్‌కి వెళ్లడం మంచిదని ఈ బృందం భావించింది. ■

## అరటిపండుపై నల్లటి మచ్చలు ఆరోగ్యానికి మేలే సుమా !

**చ**క్కని పసుపు, బంగారం రంగులో ఉండే అరటి పండ్లంటే అందరికీ ఇష్టమే.. ఎన్నో పోషకాలుండే ఈ పండ్లతో ఒనగూరే ప్రయోజనాలెన్నో ఉన్నాయి. కానీ అరటి పండ్లపై నల్లటి మచ్చ ఉంటే హానికారకమని చాలామంది నమ్ముతుంటారు. నల్లమచ్చలున్న అరటి పండ్లను తినకూడదా ..? తింటే ఏం అవుతుందో తెలుసుకోండి..!



- అరటి పండ్లు తొందరగా జీర్ణం అవుతాయి. సహజ పోషకాలను సత్వరం అందిస్తాయి.
- అరటి పండ్లపై నల్లని మచ్చలుంటే కుళ్లినవని కాదు.. నలుపు, గోధుమవర్ణం మచ్చలు ఎంత ఎక్కువగా ఉంటే అంత మంచివని నిపుణులు చెబుతున్నారు.
- నల్లమచ్చలు టీఎన్ఎఫ్ (ట్యూమర్ నెక్రోసిస్ ఫ్యాక్టర్) సూచిస్తాయి. ఇది క్యాన్సర్ పోరాట పదార్థం. ఇది శరీరంలోని అసాధారణ కణాలకు వ్యతిరేకంగా పోరాటం చేస్తుంది.
- బాగా పండినపుడు యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇది వైరస్, క్యాన్సర్ కణాలకు వ్యతిరేకంగా రోగనిరోధకతను పెంచుతుంది.
- అరటిపండ్లు పండే కొద్దీ మెగ్నీషియం పెరుగుతుంది. రక్తపోటుతో బాధపడుతున్న వారికి చాలా మంచిది. తక్షణమే అధిక రక్తపోటును తగ్గిస్తుంది.
- గుండెకు చాలా మేలు చేస్తాయి. పేగుల్లో కదలికలను బాగా ఉంచుతుంది. జీర్ణక్రియ సాఫీగా జరిగేందుకు సహకరిస్తుంది. అసిడిటీని బాగా తగ్గిస్తుంది.
- ఇందులో పీచు పదార్థం కూడా అధికంగానే ఉంటుంది. మలబద్ధకం లేకుండా చేస్తుంది. ■

గెలవడం నీ బాధ్యత కాదు, కాని గెలుపుబాటలో ఒకరోజును మించి మరో రోజు కృషిచేయడం నీ బాధ్యతే

# పశువుల గర్భధారణను తెలిపే పుణ్యకోటి పరీక్ష

– లిఖితా శ్రీరాం





**ప**శువుకు కృత్రిమ గర్భధారణ చేసిన నెల రోజుల్లో పశువు గర్భము దాల్చినదా, లేదా అని తెలుసుకొనుటకు "పుణ్యకోటి" పరీక్ష చేయవచ్చును.

**పరీక్ష విధానం**

కృత్రిమ సంపర్కం (ఆర్టిఫిషియల్ ఇన్‌సెమినేషన్) చేయించిన 30 రోజుల తర్వాత పశువు మూత్రం 30 మిల్లీ లీటర్లు తీసుకోవాలి. దానికి 4 రెట్లు మంచినీటిని కలపాలి. ఈ మిశ్రమాన్ని పరీక్ష కొరకు ఉపయోగించాలి.

మూడంగుళాల వెడల్పు, అర అంగుళం ఎత్తు గల గాజు లేక ప్లాస్టిక్ మూతలు (పిట్రి డిషేష్,) లాంటివి తీసుకోవాలి. వాటి లోపల ఫిల్టర్ పేపర్ కానీ పలుచగా దూది కానీ పరిచి, దానిపైన పెసలగింజలు కానీ, గోధుమ గింజలు కానీ 25 నుండి 30 వరకు వేయాలి. తర్వాత పైన తయారు చేసిన మిశ్రమాన్ని, తయారుచేసి వుంచుకొన్న రెండు మూతలలో వేయాలి. మూడవ దానిలో మంచినీరు మాత్రమే వేయాలి. గింజలు పూర్తిగా మునగరాదు. గింజలు మూడొంతులు మునిగేటట్లు మాత్రమే పోయాలి.

**ఆరవరోజు గింజలను పరీక్షిస్తే ...**

1. నీరు మాత్రమే వాడిన మూతలో 6 నుండి 8 సెంటి మీటర్ల పొడువు గల మొలకలు వుండును. 80 శాతము గింజలు మొలకెత్తి వుంటాయి.
2. పశువు గర్భం దాల్చినిచో, మూత్ర మిశ్రమం వేసిన మూతలో 30నుండి 60 శాతం గింజలు మొలకెత్తి, 4 నుండి 5 సెంటిమీటర్ల పొడవుండును.
3. పశువు గర్భము నిల్చివుంటే, మూత్ర మిశ్రమం వేసిన మూతలోని గింజలు మొలకెత్తవు. మొలకెత్తినా, అర సెంటీమీటరు లోపు ఉండును. గింజలు నలుపు రంగు తిరిగి వుంటాయి.

(పరీక్షకు వాడే గింజలు శ్రేష్ఠమైనవై వుండాలి. ఈ పరీక్షా విధానం జాగ్రత్తగా చేస్తే ఫలితం వంద శాతం నమ్మవచ్చు.) ■

(17 వ పేజీ తరువాయి ...)

## చీడపీడలు ఆశించే తరుణం ... బహుపరాక్

చేయాలి. మొత్తం చెట్టంతా పిచికారి చేయాల్సిన అవసరం లేదు. బలహీనంగా వున్న చెట్లకు 5 గ్రా. యూరియా లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

**బత్తాయి, నిమ్మ :**

డ్రిప్ లేకుంటే డబల్ రింగ్ పద్ధతిలో కాయలు ఉన్న చెట్లకు నీటిని అందించాలి. ఈ మాసంలో చెట్ల కాండంపై బోర్డోపేస్టును పూయాలి. పిందె, కాయ రాలడాన్ని నివారించడానికి 1.5గ్రా. 2,4–డి, 100గ్రా. కార్బండాజిమ్, 1 కిలో యూరియా 100 లీటర్ల నీటిలో కలిపి 15 రోజుల వ్యవధిలో 2 సార్లు పిచికారి చేయాలి. నల్లి నివారణకు నీటిలో కరిగే గంధకం 3 గ్రా. లేదా 5 మి.లీ. డైకోఫాల్ లీటరు నీటికి చొప్పున కలిపి 15 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారి చేయాలి.

**టమాట :**

శీతాకాలం పంటను ఈ నెలనుండి నాటుకోవచ్చు. 21–25 రోజుల వయస్సు, 3–4 ఆకులు గల మొక్కలను 60×60 సెం.మీ. దూరంలో నాటుకోవాలి. ఆకుమాడు తెగులు నివారణకు 3 గ్రా. మ్యాంకోజెబ్ లీటరు నీటికి కలిపి 15 రోజుల వ్యవధిలో 2 సార్లు పిచికారి చేయాలి. ■

మంచిమాట కంటె మంచి చేత మరింత మేలైనది

# రసాయనికం నుంచి ప్రకృతి వ్యవసాయానికి...

– మేరీ, కమ్యూనిటి ఫెసిలిటేటర్, పామిడి

**అ**నంతపురం జిల్లా , పామిడి మండలం , రామగిరి గ్రామానికి చెందిన శ్రీమతి ఆర్ పద్మావతి మహిళా రైతు. ఈమె 7 వ తరగతి వరకు చదువుకున్నారు. ఆమె భర్త శ్రీ ఆర్. ఓబులనాయుడు. వీరికి 7 ఎకరాల వ్యవసాయ భూమి వుంది. 25 సంవత్సరాలుగా వీరు వ్యవసాయంలోనే వున్నారు. ఇంతకాలం వీరు రసాయనిక వ్యవసాయంచేస్తూ వచ్చారు. మొదట్లో లాభాలు వచ్చినా రానురాను రసాయనిక వ్యవసాయం వీరికి కేవలం స్వల్ప లాభాలను పొందుతూ నష్టాల పాలవుతూ వచ్చారు. ఇటీవల వీరు ప్రకృతి వ్యవసాయాన్ని గురించి తెలుసుకున్నారు. ఆ విధానం పట్ల ఆకర్షితులైనారు. తమ పొలంలో కొంతభాగంలో ప్రకృతి వ్యవసాయం చేయాలని నిర్ణయించుకుని ముందడుగు వేస్తున్నారు. వారి అనుభవాలను గురించి శ్రీమతి పద్మావతి మాటలలో నేరుగా తెలుసుకుందాం.



'మాది పూర్తిగా వ్యవసాయం మీద ఆధారపడి జీవిస్తున్న కుటుంబం మాకు వ్యవసాయం తప్ప వేరే ఉపాధి లేదు. మొదట్లో మంచిగా వర్షాలు కురిసి పంటలు బాగా పండేవి, పంటల దిగుబడి బాగా పెంచుకోవాలని రసాయనిక వ్యవసాయం వైపు మళ్లి రసాయనిక ఎరువులు వాడాం, వాడిన మొదట్లో మంచి దిగుబడులు వచ్చేవి, మేము సంతోషంగా ఉండేవాళ్ళం. అయితే, రాను రాను వ్యవసాయంలో ఖర్చులు అధికంగా పెరిగాయి, మట్టిలో జీవం తగ్గి దిగుబడి తగ్గుతూ వచ్చాయి. కొన్ని సందర్భాల్లో పెట్టిన పెట్టుబడి కూడా వచ్చేది కాదు. గత సంవత్సరంలో పంట దిగుబడి బాగా తగ్గి నష్టం వచ్చింది. దానివల్ల మేము చాలా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కున్నాము.

**ప్రకృతి వ్యవసాయ పరిచయం**

ఈ ఏడాది (2022లో) మా గ్రామానికి ప్రకృతి వ్యవసాయ సిబ్బంది వచ్చారు. గ్రామంలో రైతులతో సమావేశం ఏర్పాటు చేసి రసాయన వ్యవసాయానికి, ప్రకృతి వ్యవసాయానికి మధ్య ఉన్న తేడాలను వివరించారు.

ఈ ప్రకృతి వ్యవసాయంతో పెట్టుబడులు ఎలా తగ్గించుకోవచ్చునో, ఆదాయం ఎలా పెంచుకోవచ్చునో, ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవడానికి ఈ ప్రకృతి వ్యవసాయం ఎలా తోడ్పడుతుందో వివరించారు.

ఇలా చెప్పడం వల్ల మాకు పూర్తి స్థాయిలో నమ్మకం వచ్చి, ప్రకృతి వ్యవసాయం చేయడానికి ముందుకు వచ్చాం. మాకు 7 ఎకరాల భూమి వున్నది, అందులో మొదటగా 2 ఎకరాలలో ప్రకృతి వ్యవసాయం చేయదానికి సిద్ధమైనాం..

ఒకరోజు వేరుశెనగ విత్తనాలు నాటడానికి తయారు అవుతుండగా మా పొలం దగ్గరకు జడ్ బి ఎన్ ఎఫ్ సిబ్బంది, ఐ సి ఆర్ పి శ్రీనివాస్ గారు వచ్చారు, మాటలలో వేరుశెనగ పంట గురించి చర్చ వచ్చి, గత సంవత్సరం వేరుశెనగ పంట దెబ్బతిని నష్టపోయాం అని తెలుపగా, వారు అపుడు ఘన, ద్రవ, కషాయాల ఉపయోగం గురించి, అంతర పంటలు వేయడం వల్ల పొందగలిగే అధిక దిగుబడుల గురించి, భూమి సారవంతమయ్యే తీరు గురించి చెప్పారు.

విషయాలు తెలుసుకున్న మేము 2 ఎకరాలలో వేరుశెనగ పంట ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేయాలని నిర్ణయించుకున్నాము.

**పెట్టుబడులు**

ప్రతి సంవత్సరం వ్యవసాయ పెట్టుబడుల కోసం

సంఘం నుండి అప్పు తీసుకోవడంతోపాటు బయట నుండి కూడా అప్పు తీకుకోవలసి వచ్చేది.. కానీ ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో 2 ఎకరాలలో వేరుశనగ పంటకు బయట నుండి అప్పు తెచ్చుకునే అవసరం రాలేదు. ఎరువులు, పురుగు మందులు కొనకుండా ఆకులు, కషాయాలు, ఆవుపేడతో ఎరువులు తయారు చేసుకుని పంటకు వేశాం కాబట్టి రసాయన వ్యవసాయంతో పోల్చి చూస్తే ప్రకృతి వ్యవసాయంలో ఖర్చు కూడా తక్కువే అయింది.

**రసాయనిక – ప్రకృతి వ్యవసాయ ఖర్చులలో తేడా ...**

(ఖర్చు ఒక ఎకరాకి రూపాయలలో)

| దశ | రసాయనిక విధానం | ప్రకృతి విధానం | తేడా |
|---|---|---|---|
| దుక్కి దున్నడం | 6000 | 6000 | 0 |
| విత్తనాలు కొనడం | 15000 | 15000 | 0 |
| విత్తనాలు చల్లడం | 1400 | 1400 | 0 |
| ఎరువులు | 10000 | 6000 | 4000 |
| ఎరువులు చల్లడం | 0 | 0 | 0 |
| పురుగుమందులు | 3600 | 500 | 3100 |
| పురుగు మందులు | | | |
| పిచికారీ | 0 | 0 | 0 |
| కలుపుకి కూలీలు | 1800 | 1800 | 0 |
| మల్చింగ్ | 0 | 0 | 0 |
| కోత | 6000 | 6000 | 0 |
| మొత్తం | 43800 | 36700 | 7100 |

**ప్రకృతి వ్యవసాయం చేయడం వలన కలిగే లాభాలు :**

- పెట్టుబడులు తగ్గుతాయి, ఆదాయం పెరుగుతుంది
- భూమి గుల్లబారుతుంది. ప్రకృతి వ్యవసాయ పంటలు తినడం వల్ల ఆరోగ్యం మెరగుపడుతుంది.
- అంతర పంటలవల్ల మరింత లాభం.
- బయట అప్పులు తీసుకోకపోవడం.

ఇన్ని ఉపయోగాలున్న ప్రకృతి వ్యవసాయాన్ని మాకున్న మొత్తం ఏడు ఎకరాల భూమిలో తప్పనిసరిగా చేపట్టాలని నిర్ణయించుకున్నాం. ■

## తినండి ... బరువు తగ్గండి !

**శా**కాహారులకు ఓ శుభవార్త, చక్కని ఆకు, కాయగూరలతో కూడా బరువు తగ్గొచ్చని పరిశోధకులు వెల్లడించారు. ఇన్నాళ్లు బరువు తగ్గడానికి నానా తంటాలు పడిన వారికి శాకాహారంలోనే



ఇష్టమైన వంటలు తినొచ్చు. బరువు తగ్గొచ్చు. ఎలాగంటారా..? తెలుసుకోండి.

- బరువు తగ్గాలనుకునేవారు చిక్కుళ్లతో కూడిన ఆహారాన్ని ఎక్కువగా వినాలి. చేపలు, ఉత్పత్తులను తక్కువగా తింటే బరువు తగ్గిపోతారు. ఈ విషయం ఫిజిషియన్స్ కమిటీ ఫర్ మెడిసిన్‌కు చెందిన నిపుణుల అధ్యయనం తెలిసింది.
- ఈ పరిశీలనలో 244 మంది స్థూలకాయులకు 16 వారాల పాటు ఆహారాన్ని అందించారు. ఇందులో కొందరికి ఇష్టమైన ఆహారం ఇవ్వగా, మరికొందరికి శాకాహారం మాత్రమే తినాలని సూచించారు. శాకాహారులకు చిక్కుళ్లను ఇచ్చారు.
- కూరగాయలు, తృణధాన్యాలు, పండ్లను కూడా అందించారు. నాలుగు నెలల తర్వాత అధ్యయనంలో పాల్గొన్న వారి శరీర బరువు, కొవ్వు, ఇన్సులిన్ స్థాయిలను లెక్కకట్టారు.
- ఇష్టం వచ్చినట్టు ఆహారం తీసుకున్న వారిలో ఎలాంటి మార్పూ కనిపించలేదు. శాకాహారం తీసుకున్న వారిలో మాత్రం సగటున 1.25 కిలోల బరువు తగ్గారు. వీరి కొవ్వు సగటున 4.12 కిలోలు తగ్గినట్టు గుర్తించారు.
- ఆహారంలో నాణ్యత పెంచడంతో ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని తేలింది. చిక్కుళ్లు, పండ్లు, తృణధాన్యాలతో బరువు తగ్గొచ్చని నిపుణులు సూచిస్తున్నారు. ■

# నీరు, ఆరోగ్యం, పరిశుభ్రతలపై అవగాహన

– ఆర్‌వైవిఎస్‌వి భాస్కరరావు

విజయనగరం జిల్లా బొండపల్లి మండల సమాఖ్య సభ్యులకు , విలేజ్ అకౌంటెంట్‌లకు, హెల్త్ కమిటీ సభ్యులకు ఆరోగ్యం, నీరు, పారిశుద్ధ్యం, పరిశుభ్రత అంశాలపై ఏపిమాస్, సెర్ప్ సంస్థల ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది.

ఆరోగ్యంగా ఉండాలంటే ఆహారంలో సమతుల్యం ఉండాలి. నేటి ప్రపంచంలో పిల్లలు, యువకులు, మహిళలు, వృద్ధులు పోషకాహార లోపంతో బాధపడుతున్నారు. పోషకాహార లోపం వలన పిల్లల్లో ఎదుగుదల తగ్గిపోతుంది, తల్లుల్లో రక్తహీనత పట్టిపీడిస్తోంది. అందుకు కారణం సమతులాహారం లేకపోవడమే అని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. స్కూల్ నుంచి పిల్లలు రాగానే కడుపు నింపుకోవడానికి స్నాక్స్ (నూడిల్స్) ఇస్తున్నారు.

ఇలాంటి ఆహారంలో ఉప్పు, చక్కెర, మసాలా దినుసులు ఎక్కువగా ఉండుటవలన శరీరానికి కావలసిన పోషకాహారాలు అందవు కదా, అనారోగ్యం పాలవుతున్నారు. వీటితో పాటు విటమిన్లతో పాటు ఇనుము, జింక్ లాంటి మినరల్స్ ఉండే పదార్థాలు తినాలి. ఇది రోగనిరోధక వ్యవస్థ సరిగా పని చేయడానికి తోడ్పడుతుంది. ముఖ్యంగా ప్రతి ఇంటి వద్ద జామ, మునగ చెట్లు, ఆకుకూరలు పెంచి ఆహారం తినటం వల్ల ఐరన్ పుష్కలంగా దొరుకుతుంది. వీటితోపాటు, కూరగాయలు, పండ్లు, పప్పు దినుసులు, చిరు ధాన్యాలు, గుడ్లు, మాంసం, పాలు, పెరుగు, మజ్జిగ తదితర పదార్థాలు రోజూ మనం తినే ఆహారంలో ఉండేటట్లు చూసుకోవాలి. పుల్లగా ఉండే పండ్లను తీసుకుంటే శరీరానికి విటమిన్-సి ఎక్కువగా లభిస్తుంది. దానిమ్మ, సపోటా, జామ వంటి పండ్లను తింటే కేలరీలు ఎక్కువగా లభిస్తాయి. శరీరానికి మరింత బలం కావాలంటే పండ్లతో ఎలాంటి ఆహారాలు తీసుకుంటే మంచిదో ఈ ఆర్టికల్ ద్వారా తెలుసుకుందాం.

శరీరానికి శక్తిని అందించడంలో పండ్లకు ఉన్న ప్రత్యేకత వేరు. పండ్లలో రకరకాల పోషకాలు, విటమిన్లు, యాంటీ ఆక్సిడెంట్స్ దండిగా లభిస్తాయి. మామిడి, బొప్పాయి, అరటి వంటి లేత పసుపు రంగు గల పండ్లలో విటమిన్-ఎ ఎక్కువగా ఉంటుంది. ఇది రోగనిరోధక శక్తిని బలోపేతం చేస్తుంది. ఈ నేపథ్యంలో ప్రజలందరికీ ఆరోగ్యంపై అవగాహన కొరకు పోషణ వారోత్సవాలు నిర్వహించడం జరుగుతున్నది.



**పౌష్టికాహార వంటకాల ప్రదర్శన**

నీరు, పారిశుధ్యం, పరిశుభ్రత (వాష్) ఆవశ్యకత వివరిస్తూ.

1. నీరు , పారిశుధ్యం ,పరిశుభ్రత ఎందుకు అవసరం ?
2. వాష్ అంశాలు లోపిస్తే అవి దేనికి దారి తీస్తుంది ?
3. ఎవరు ఎక్కువగా ప్రభావితం అవుతారు ?
4. వాష్ అలవాట్లను ఎలా మెరుగుపరచాలి ?
5. నీరు, పారిశుధ్యం , పరిశుభ్రతను పాటించడం వలన లాభం ఏంటి ? అనేది శిక్షణలో నేర్చుకొని సమాజానికి సమాచారాన్ని యివ్వడానికిఈ శిక్షణ ఉపయోగం

వాష్ అంశాలు లోపిస్తే ఏమి జరుగుతుంది అనే అంశం పై వివరిస్తూ సూక్ష్మక్రిములు అనేక మార్గాలు ద్వారా శరీరంలో ప్రవేశించి దుష్ప్రభావాలు చూపిస్తాయని వివరించారు. వాష్ అంశాలు లోపిస్తే ఎక్కువగా పిల్లలు, మహిళలు, వృద్ధులపై సురక్షితంకాని నీరు, పేలవమైన పారిశుధ్యం ప్రభావం చూపిస్తుంది.

**పారిశుధ్యం మెరుగుపరుచుట :** వ్యక్తిగత మల మూత్ర విసర్జనకు మరుగుదొడ్డి నిర్మాణం, మల మూత్రములను సురక్షితంగా బహిర్ ప్రదేశంలో దూరంగా విసర్జించే ఏర్పాటు

- వ్యక్తిగత గృహ మరుగుదొడ్డి నిర్మాణం – రెండు గుంతలు మోడల్
- వ్యక్తిగత గృహ మరుగుదొడ్డి విభిన్న ప్రతిభావంతులకు ఉపయోగకరంగా ఉండే మోడల్ నిర్మాణం (ఎఎఫ్‌టి) ఎఎఫ్‌టి మరుగుదొడ్డి నిర్మాణం : ఇది గర్భిణిలకు, విభిన్న ప్రతిభావంతుల కోసం, పెద్దవారి కోసం, ఈ మరుగుదొడ్డి వినియోగించవచ్చు అని తెలియజేసిరి.

**లాభాలు**

- ఎప్పుడు అవసరమైతే అప్పుడు నీటి లభ్యత వల్ల ఎక్కువ సౌలభ్యం.
- మానసిక ప్రశాంతత, క్యూలో నిలబడాల్సిన పని లేదు. వంతులకోసం తిట్టుకోవాల్సిన పని లేదు. ఎక్కువ బరువు మోయాల్సిన పని ఉండదు.
- నీటి ద్వారా ప్రబలే వ్యాధులు దరి చేరకుండా కళ్ళెం వేయొచ్చు.
- ఆత్మ గౌరవాన్ని కలిగిస్తుంది. పిల్లలు తమ చదువులపై పూర్తిగా శ్రద్ధ చూపిస్తారు.
- స్థలం యొక్క విలువ పెరుగుతుంది. ధనాన్ని ఆదా చేస్తుంది. ఆరోగ్య ఖర్చు తగ్గుతుంది. ఆదాయాన్ని సంపాదించడం కోసం ఎక్కువ సమయం ఉంటుంది అని ఏపిమాస్ రీజియనల్ కోఆర్డినేటర్ శ్రీ ఆర్ వై వి ఎస్ వి భాస్కరరావు , డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ శ్రీమతిసత్యవతి శిక్షణలో వివరించారు.

నీరు, పారిశుధ్యం మరియు పరిశుభ్రత యొక్క ఆవశ్యకతతో పాటు సమతుల ఆహారం గురించి శ్రీమతి సావిత్రి ఏపీడీ, డిఆర్‌డిఏ వారు వివరిస్తూ వాటర్.ఓఆర్‌జి ప్రాజక్ట్ మంచి ఫలితాలు తీసుకురావాలి అని అందరిని ప్రోత్సహించిరి.

**శిక్షణలో పాల్గొన్నవారు**

శ్రీమతి సావిత్రి ఏపీడీ, డిఆర్‌డిఏ, శ్రీ.జె.లక్ష్మునాయుడు, ఏరియా కోఆర్డినేటర్, శ్రీమతి గీత ఏపీఎం, హెచ్ & శ్రీన్ శ్రీమతి సులోచన ఏపీయం మరియు ఏపీమాస్ సిబ్బంది శ్రీ ఆర్‌వైవిఎస్‌వి భాస్కరరావు (రీజినల్ కోఆర్డినేటర్, శ్రీకాకుళం) శ్రీమతి సత్యవతి (డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్, విశాఖపట్నం, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు. ■

*(15వ పేజీ తరువాయి...)*

## నీళ్ళు తక్కువ తాగినా, ఎక్కువ తాగినా సమస్యే !

- నీటిని ఎక్కువగా తీసుకోవడం వల్ల ఎక్కువసార్లు మూత్రానికి వెళ్లాల్సి వస్తుంది. ఇది కిడ్నీలపై ప్రభావం చూపుతుంది.
- ఎక్కువ సార్లు మూత్రానికి వెళ్లడం వల్ల శరీరంలోని మినరల్స్‌ను కోల్పోతాం.
- ఓవర్ హైడ్రేషన్ వల్ల వాంతులవ్వడంతో పాటు డయేరియా బారిన పడే ఆస్కారం ఉంది.
- శరీరంలో నీరు ఎక్కువైతే కాళ్లు, చేతులు, పెదాల్లో వాపు వస్తుంది.
- ఎక్కువ నీరు తాగడం వల్ల కండరాలు బలహీనంగా మారడంతో పాటు పట్టేస్తాయి.
- అదే పనిగా నీళ్లు తాగితే అలసట, నీరసం వచ్చే అవకాశాలున్నాయి.
- నీటి శాతం పెరగడం వల్ల రక్తం పరిమాణం పెరిగి గుండె ఎక్కువగా పని చేయాల్సి వస్తుంది. దీంతో హృద్రోగ సమస్యలు వచ్చే ఆస్కారాలున్నాయి.
- రోజుకు సుమారు 4 లీటర్లు కంటే ఎక్కువ నీటిని తీసుకోవడం మంచిది కాదని వైద్యులు చెబుతున్నారు. ■

# జీవనోపాధుల బలోపేతం


ప్రత్యామ్నాయ పంటల సాగు పద్ధతులు...
చిన్న, సన్నకారు రైతులకు అదనపు ఆదాయ మార్గాలు

## చేపట్టే పనులు

డైరీఫాం, పౌల్ట్రీ

పందిళ్ళపై కూరగాయల సాగు

బహుళ పంటల సాగు




పెరట్లో కూరగాయల పెంపకం

చిరు ధాన్యాల సాగు

చిరు ధాన్యాల ప్రాసెసింగ్

NABARD

MAHILA SADHIKARATHA
Publication Date: 01-10-2022 ; Posting Date: 05 & 06-10-2022

RNI Regd No: TELTEL / 2003 /16365
Postal Regd No: HD/1064/2021-23



గోరంట్లపల్లిలో మొక్కలు నాటుతున్న
శ్రీ నిత్యానందరెడ్డి, శ్రీ సి ఎస్ రెడ్డి



ఏపిమాస్ హైదరాబాద్ కార్యాలయంలో
జి ఐ జడ్ బృందంతో ఏపిమాస్ బృందం




హైదరాబాద్‌లో సి ఐ ఐ నిర్వహించిన
'టి ఎస్ ఫుడ్ బిజ్ 'లో శ్రీ సి ఎస్ రెడ్డి

## ఏపిమాస్ ఆధ్వర్యంలోని మరికొన్ని ఎఫ్ పి ఓల వార్షిక మహాసభల దృశ్యాలు



రామసముద్రం ఎఫ్ పి ఓ మహాసభ



సదుం ఎఫ్ పి ఓ మహాసభ



పుంగనూరు ఎఫ్ పి ఓ మహాసభ



తాడిపత్రి ఎఫ్ పి ఓ మహాసభ



రైతునేస్తం ఎఫ్ పి ఓ మహాసభ



రైతుస్వరాజ్యం ఎఫ్ పి ఓ మహాసభ



భూసంపద ఎఫ్ పి ఓ మహాసభ





ఆదివాసి ఎఫ్ పి ఓ మహాసభ



బొల్లవరం ఎఫ్ పి ఓ మహాసభ



ఆర్ సి పురం ఎఫ్ పి సి మహాసభ



రెడ్డమ్మ ఎఫ్ పి ఓ మహాసభ

To ADDRESS



నిమ్మనపల్లి ఎఫ్ పి సి మహాసభ



కేతనపల్లిలో వాటర్ ఫిల్టర్ల పంపిణీ

**బట్వాడా కాకపోతే దయచేసి ఈ చిరునామాకు తిప్పిపంపండి**

ఎడిటర్, ఏపిమాస్ కార్యాలయం, ప్లాట్ నెం.11-12, హుడా కాలని, తానీషా నగర్, డ్రీమ్ వ్యాలీ దగ్గర, మణికొండ, రంగారెడ్డి జిల్లా, హైదరాబాదు-500089